అభినవసరస్వతి

యను నొక మాసపత్రిక.

నాగరఖండ స్వర్ణకారవ్యవహారాది బహుగ్రంధకర్తయగు
జానపాటి పట్టాభిరామశాస్త్రిచేఁ
ప్రచురింపఁబడుచున్నది.

జానపాడు.

సంపుటము 21 — 1929 సం॥ మే, జూన్ నెలలు — సంచికలు 2, 3

విషయములు.

౧ స్వవిషయము — సంపాదకుఁడు.
౨ కృతివిమర్శనము.
౩ అభూతకల్పన.
౪ వేంకటగిరి ప్రస్థానము.
౫ నూతనవిమర్శనము — టి. వేంకటకృష్ణయ్యగారు.
౬ ఆరోగ్యకామేశ్వరి —
చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు.
౭ నాగరఖండము — సంపాదకుఁడు.

చందానిర్ణయము సంవత్సరమునకు

ప్రధానపోషకులకు రు 25 0 0 సహాయులకు రు 5 0 0
పోషకులకు రు 10 0 0 చందాదారులకు 3 0 0

Printed at the Chandrika Press, Guntur,
and published at Janapadu by the Editor, Astavadhani
Janapati Pattabhirama Sastry,
author of Nagarakhandam, Swarnakaravyavaharam
etc., etc.

ప్రధానపోషకులు.

౧. శ్రీ శ్రీ జగద్గురు విరూపాక్ష స్వాములవారు, రఘుపతిపేట.
౨. శ్రీ శ్రీ జగద్గురు పుష్పగిరి స్వాములవారు, లగిసెట్టిపేట.
౩. బాకరాజు పరాంకుశరావుదేశాయిగారు. యాదవరం.
౪. రామసింగుగారు- నెల్లుట్లపాపురసంస్థానముల మేనేజరు- నెల్లుట్ల.

పోషకులు.

౧ రాజా వెంకటాద్ర్యప్పారావు, బహదరు జమీందారుగారు-నూజవీడు.
౨ గూడూరి వీరసాంబశివరావు సర్దేశపాండ్యాగారు, మానుకోండూరు
౩ జాగర్లమూడి కుప్పుస్వామినాయఁడుగారు, కారంచేడు
౪ నెల్లుట్ల నరసింహారావుగారు, జనగాం
౫ లింగాల వెంకటరెడ్డి దేశముఖుగారు, కుందవరము
౬ రంగాచార్యులుగారు, ముక్త్యారు, దేశముఖు, మసీదుపల్లి.
౭ చారబుడ్డి రత్నారెడ్డిపటేలుగారు, న్యాలపోగుల
౮ రామయాంబికా పుస్తకభాండాగారము, లక్ష్మీనర్సాపురము.
౯ తంగెడ నరసింహారావుగారు, కరణం, మోర్జంపాడు
౧౦ టి. లక్ష్మణసింగుగారు, జనగాం
౧౧ రాజా మంత్రిప్రగడ వెంకటహనుమంతరావు, రాఘవరావుగార్లు, లింగగిరి.
౧౨ పిలుపాటి వెంకటరాయశర్మగారు, కరవది
౧౩ శ్రీ శ్రీ జగద్గురు అభినవ విరూపాక్ష పీఠాధిపతులు, కాకినాడ.
౧౪ శ్యామాపంతుల వెంకటేశ్వరరావుగారు, తహశీల్దారు, ఆరుమూరు.
౧౫ కొత్వాలి వెంకటేశ్వరరావుగారు, సంగెం
౧౬ లింగాల రంగారెడ్డి దేశముఖుగారు, గణపురం,
౧౭ రాజా కందుకూరు సూర్యప్రకాశరావు బహద్దరు, జమీందారుగారు-దేవిడి.
౧౮ సాకుంట కిషన్‌రావు దేశముఖ్ గారు, జరితాల.
౧౯ శ్రీమద్వెంకట శేషారెడ్డి రామచంద్రారెడ్డి దేశముఖుగార్లు, అల్లాదుర్గసంస్థానము.
౨౦ తడిసిన గోపాలరెడ్డి దేశాయిగారు, దొంతి.

సహాయులు

౧ కాకుమాను హనుమయ్యగారు, నర్సారావుపేట
౨ మెదక్ కిషన్‌రావు దేశముఖుగారు, నల్లపల్లి
౩ వీరకాయల హనుమంతరావు దేశపాండ్యాగారు, రాయగిరి
౪ లక్ష్మీనరసింహస్వామివారు, యాదగిరి
౫ నెల్లుట్ల కేశవరావు దేశముఖుగారు, పాపురం.
౬ వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు, చెన్నపట్టణము.
పెద్దిభట్ల వీరయ్యగారు, ప్లీడరు బెజవాడ
తిప్పరాజు కామేశ్వరరావుగారు, కరణం, దుగ్గిరాల

అభినవసరస్వతి.

సంపుటము ౨౧	జానపాడు శుక్ల సం॥ వైశాఖ, జ్యేష్ఠమాసములు.	సంచికలు ౨, 3

స్వవిషయము.

చాలకాలమునుండియు నీ యరణ్యరోదన మెవరాలకింతురని స్వవిషయము నేను వ్రాయుటలేదు. నిజముగా నది యరణ్యరోదనమే యయినను నీసారి యొకింత చేయవలసివచ్చినది. ఇదివఱకుఁగూడఁ బత్రిక సకాలమునఁ బ్రచురింపలేక రెండేసి మాసములవి కలిపి ప్రచురించినవి క్వాచిత్కముగా నుండియున్నవి. విభవ సం॥ కార్తికమార్గశిరమాసములవి కలిపియే ప్రకటించితిని. అయినను నందలి కాశీయాత్ర యఖిలభారతవర్షీయ బ్రాహ్మణమహాసమ్మేళనమను వ్యాసములే యందులకుఁగల కారణము దెలియఁజేయఁగలవియై యుండుటంజేసి స్వవిషయము వేఱుగా వ్రాయవలసిన పని లేకపోయెను గాని ప్రకృతము తప్పినదికాదు. గోలకొండపత్రిక కొండాడినట్లీపత్రిక మొదలే బిచ్చగత్తెయును రెండువేల యేండ్లే కాక యంతకుఁ బూర్వము నుండియు ననుస్మృతములైన యాచారములే యనుష్ఠేయములని యాక్రోశించునదియు నైయున్నది. ఇట్టిపత్రిక క్రైస్తవమహమ్మదీయులకు మొదటికే పనికిరాదు. సరికదా! హిందువులకైనను నెందఱకో పనికిరానిదైయున్నది. ఆర్యసమాజ బ్రహ్మసమాజాదులవారందఱును హిందువులే కదా! సనాతనమతానుయాయులకు శ్రద్ధ తక్కువ; శ్రద్ధయున్నను లోభ మెక్కువ. కాఁబట్టి సనాతనధర్మబోధకపత్రికల కిట్టిగతి పట్టినది. ఎన్ని యిట్టిహేతువులున్నను నెట్లో యిరువదియొక్క సంవత్సరములనుండి యిక్కట్లు లెక్కపెట్టక యీడ్చు

కొని వచ్చుచున్న వాఁడను. కాని యస్మ జ్జన్మలగ్న వశమున భాగ్యవ్య యాధిపతియైన బుధుని యంతర్దశ వచ్చినది మొదలు మఱియుఁ గష్ట సాధ్యమైనయది. పరిభవ సం॥ మార్గశిరశు ౯ మొదలుకొని ప్రమోదూత సం॥ జ్యేష్ఠ బ ౧౨ పర్యంతము రాహుమహాదశలో బుధాంతర్దశ. పరిభవ సం॥ మార్గశిరములో నీబుధదశ వచ్చినది. పుష్యములో మాయన్నగారు పరలోకగతులైరి. ఆయనకుమారులు చిన్నవాండ్రై యుండి కొన్ని చిక్కులలోఁ జిక్కుకొని యుండఁగా బాసటకాఁబోవుటయు దాయాదశత్రువుల ద్వారమున నవి నామీఁద విఱుచుకొని పడియెను. దాయలు మఱింత విజృంభించిరి. అందులకుఁగాఁ గోర్టుల కెక్కవలసి వచ్చెను. పడిన భారము వచ్చి పడఁగాఁ పైని మఱి కొంత వ్యయపెట్టవలసి వచ్చెను. అందులకు ఋణము చేయవలసి వచ్చెను. ఇట్టిచిక్కులలోఁ జిక్కుకొనియే యేడాది రెండేండ్లనుంచి యించుక కాలవ్యవధితోనే పత్రిక వెలువరించు చుంటిని.

నాస్థితియే యిట్లుండ నాపత్రిక ముద్రింపించువారి స్థితియు నందులకుఁ దోడయ్యెను. చూడుఁడు. చైత్రమాసపత్రిక మ్యాటరు నేనే చైత్రాంతమం దిచ్చి వచ్చితిని. అది వైశాఖశుద్ధమందు ముద్రించి యిచ్చిరి. ఇంతలో నేను నిజాము రాష్ట్రమునకు వచ్చి వైశాఖ బ 3 నాడు వైశాఖమాసపత్రిక మ్యాటరంతయు వ్రాసి మెదకు జల్లాలోని గడిపెద్దాపురముపోష్టు ద్వారమున గుంటూరు చంద్రికా ప్రెస్సునకుఁ బంపించితి. పత్రికముద్రింపించి మాయూరికిఁ బంపుచు ౧౦ సంచికలు సికింద్రాబాదునకు నాపేరఁ బంపుఁడని దోమకొండ నుండి మరలవ్రాసితిని. దాని క్రిందిజవాబుమాత్రము చంద్రికా ముద్రాశాలాధ్యక్షు లీమని భీమశంకరముగారు వ్రాసిరి.

... మీరు మేటరుపంపించినాము అని వ్రాయించినారు. ఆమేటరు ఎక్కడ గయిరువిలియా అయినదో యింతవరకు మాకు చేరి యుండలేదు...

ఇఁక నేమిచేయుదు. ఆపంపినమేటరులో నెంతకాలము క్రిందనో

గోవిందరాజు హరిశ్చంద్రరావుగారు పంపిన కాంగ్రెసు, మతము, అను పెద్దవ్యాసముండెను. దానికి మఱియొక కాపీకూడ లేదు. శాసన సభ్యులుగాఁ జేరి కాంగ్రెసువారు లోకులకుఁ గలుగఁజేయు కష్టము లన్నియు విపులముగా దానఁ దెలుపఁబడియున్నవి. ఏమైననేమి. ఇట్లయినది. ఈనఁగాచి నక్కల కప్పఁజెప్పిన ట్లింత చేసియు నీమేటరు నిట్లు కోల్పోవవలసివచ్చెను. చీట్లులేక గడిపెద్దాపురము పోష్టునకుఁ బోయి తీసికొని యక్కడనే ప్యాకెట్టుకట్టి పెట్టెలో వేయఁబోవుటయుఁ బోష్టువారు పెట్టెలో నేలవేయుదురు? టప్పాకట్టుసమయ మాసన్న మగుచున్నది. ఇచ్చటనే పెట్టుఁడని తమయొద్దఁ బెట్టించుకొనిరి. పోష్టు మేష్టరు రోకసాయబుగారు. ఆపోష్టుద్వారమున నేఁడెనిమిది నాపత్రికలు నెలనెలకుఁ బోవుచుండును. ఆకారణమునంజేసి వారు నన్నినామడిగిరి. మావలనఁగూడ నినాము తీసికొనెదరా యంటిని. మే మందఱివలనను దీసికొనెదమనిరి. ఆసమయమున నాయొద్ద నేమియు లేకపోయెను. ఈరుండనే వెళ్ళివచ్చితిని. అందులకై యిట్లుజరిగినదేమో! ఏరాజ్య మందలి యేదోషములైన నగ్గడింపవచ్చునుగాని నిజామురాష్ట్రములోని నిజమైనసంగతులనుగూడ వ్రాయఁగూడదు. వ్రాసిన గోలకొండ కొట్టవచ్చును. సత్యవాదులు చెలరేగుదురు. దేశబంధువు ధీగఱపును. దేశవాసులు తిండ్రింతురు. అస్మత్పత్రిక కాంధ్రదేశమం దంతటను జందాదారులున్నను మాదేశమున సంపాదించుకొని పోవుచుంటివని మందలింతురు. ఇట్లనువారిలో నొకరును దీనికిఁ జందాదారులు కారు. అమ్మ తాను బెట్టనుబెట్టదు అడిగికొని తిననీయదను సామెత యిచ్చట బాగుగాఁ బట్టును.

చంద్రికాప్రెస్సు ప్రొప్రయిటరుగారి జవాబుచూచి యదియో యిదియో మేటరంతయు మరలవ్రాసి జ్యేష్ఠ శు ౬ నాఁడు హైదరాబాదునుండి రిజిష్టరుచేసి పంపితిని. ముద్రితమైన పత్రికలు నాపేర గి జనగామునకుఁ బంపుమంటిని. రెండుమూఁడుసారులు వ్రాసితిని. పదిదినములైనను బంపలేదు. తుదకు నిష్ఠురముగా వ్రాసితిని. చంద్రికాముద్రాక్షరశాలాధికారిగా రీకిందిప్రత్యుత్తరము వ్రాసిరి.

... మీరుపంపించిన 100 నూరు రూపాయలున్నూ చేరినవి. వైశాఖమాసము మ్యాటరు పేకట్టు చేరలేదు మరల రిజష్టరుద్వారా పంపించిన నాగరఖండములు వగయిరా మ్యాటరులు చేరినవి. నేటికి 25 దినములనుండి బ్రి॥ చ॥ అమరేశ్వరశాస్త్రిగారు ... ... ఆస్పత్రిలో మకాముగా యుండి వయిద్యము చేయించుకుంటూ యున్నారు. నాకును ఏకారణముచేతనో సుస్తీగా యుంటూయుండి ఆఫీస్కు సరిగా పనికి వచ్చుటలేదు. యీకారణముచే యేపనులున్నూ చేయుటలేదు. నిన్నను నేడు కొంచెము సులువుగా యుంటూయుండుటచే కట్టలు విప్పుచున్నాము. ... ... ప్రస్తుతము ఆలస్యమయినదిగాన రెండుమాసములు కలిపి ముద్రించతలచి నాగరఖండము వగయిరా పని ప్రారంభించినాను. నాగరఖండము కామేశ్వరి రెండేసి ఫారములు చేయించి పత్రిక తయారుచేయించతలచినాను. నాకు పంపించిన మేటరు మిగతవి చేర్చి పత్రిక చేయించుదును. ఇంకను ఏమయిన మార్పు చేయదలంచినచో తెలుప ప్రార్థితులు. మీకు శ్రమ కలుగజేసినందుకు మిక్కిలి చింతించుచున్నాను. దైవికమునకు యేమి చేయగలము. గాన ప్రకృతము యోచించి వ్రాయగలరు. ఆలస్యమునకు క్షమించగలరు. చిత్తగించవలెను.

యీమని భీమశంకరము వ్రాలు.

కొందఱు చందాదారుల సమావేశము కాకయుఁ బొంబెక్ పేనాయు గడియారమును బోఁగొట్టుకొనియునే యస్వస్థచిత్తముతో నేను జనగాను చేరువఱకు నీయుత్తరము వచ్చియుండె గోరుచుట్టుమీఁద రోకటిపోటు తగిలినట్లు కావించెను. ప్రకృతము గ్రహచారము చాలకుండుటయేకాక సహజమైన మఱపురోగ మొకటి నన్ను మఱింత బాధించెడిని. అట్టి మఱపువలనఁ బోఁగొట్టుకొనునవి కొన్నియు, సమయముచేచి ప్రచ్ఛన్నచోరులు హరించినవి కొన్నియు నన్నియు గాగి పొంతెక్ పేనా లిప్పటికి నేను గోలుపోయినవి. నాపత్రిక కొకసహాయము [illegible] చక్రవర్తి నరసాంచాచార్యుల అయ్య

వార్లంగారు తమయూరైన శాతాపురమునకు నేనుబోఁగర మాదరించి చందా దయచేయుచుఁ దమగ్రామమే యగు కోతులాబాదులోఁ గ్రొత్తగాఁ గట్టించినగృహమునఁ బ్రవేశింపఁబోవుచు నాహ్వానింప నచటి కేఁగియుంటిని. తత్కార్యము ముగియుటయుఁ దన్నిమిత్తక సత్కారముగూడఁ జేసి నన్ను వారు సబహుమానముగాఁ బంపించిరి. కాని యక్కార్యమున కేతెంచిన వైష్ణవస్వాము లెవ్వరో ౨౫ రూపాయల గడియారమును హరించిరి. సత్రములు వేయువారు కొందఱైనఁ గూలఁద్రోయుటకుఁ గొందఱు సిద్ధమగుదురు. ఆడోళ్ల కిరువదియేండ్లు మగవోళ్లక ముప్పదేండ్లు బాలప్రాయము పండ్రెండేండ్లన్నట్లు నా యిడుములనుండి కొంతయు ముద్రాక్షరశాలాధికారుల యిడుములనుండి కొంతయు నాలస్యముమీఁద రెండునెలల సంచికలును గలిపి ప్రకటింపవలసివచ్చినది. క్రమముగా నెట్లో సవరించుకొని యిఁక సకాలమునఁ బత్రికల వెలువరింతును గానఁ దొందఱపడకుండుటకై చందాదారులు సంప్రార్థితులు.

కృతి విమర్శనము.

అర్థశాస్త్రిచంద్రిక, ప్రథమభాగము—ఇది గోవిందరాజు హరిశ్చంద్రరావుగారిచేఁ బ్రణీతము. ఇం దౌషధములను యంత్రములను బదార్థవ్యయమును జీవనోపాధిలోపమును గుటుంబశైథిల్యమును దౌర్బల్యమును శీలభ్రంశమును నతివృష్టిని ననావృష్టిని ద్రవ్యనష్టిని వ్యక్తిలోపమును సౌందర్యహానిని రుచిమున్నగు గుణములను దారిద్ర్యమును బట్టుదలను శ్రమవిభాగమును నర్థమును సనాతనమతమును మనోబలమును గూర్చి శాస్త్రియుక్త్యనుభవహేతుప్రదర్శన పూర్వక

ముగా మిగులఁ జర్చింపఁబడియున్నది. యంత్రనిర్మాణమునకు లోహాదులావశ్యకములు కావున నాగలి మున్నగు ముఖ్యవస్తువులుగూడ దుర్లభములును బహుమూల్యములును నగుచున్నవనియుఁ దన్మూలమున నిర్మలవాయువును నిర్మలకాంతియు లేని యగాధఖనులలో దిగి యనేకులాత్మజీవితము హ్రస్వముఁ జేసికొనుచుండిరనియు యంత్రప్రవర్తనమున కావశ్యకములగు బొగ్గులకుఁగాఁ బెక్కుమ్రాకులు గూల్చివేయఁబడుటచేతనే ప్రకృతము వర్షములు లేక క్షామములు మెండైనవనియుఁ బ్రజలకుఁ గట్టెపుల్లలు కఱవైనవనియు యంత్రము లిట్లనర్థదాయకములగుటనే పూర్వికు లవి విడిచి యుండిరికాని వాని నెఱుంగక కాదనియు మానవులు యంత్రములు లేకుండ స్వల్పకార్యమైనను నిర్వహింపఁజాలక దైన్య మనుభవించుచు వానికి దాసులైరనియు యంత్రములవలని యనర్థములు పెక్కు లిందుఁ గనఁబఱుపఁబడినవి. స్థూలదృష్టికి యంత్రములవలనఁ గొన్ని సౌకర్యములు మనకుఁ గనఁబడినను భూమిని దున్నుట కొక యంత్రమును ధాన్యము పండించుట కింకనొకటియు బియ్యము చేయుటకు మఱియొకటియు నన్నము వండుటకింకొకటియు దానిఁ గలిపి ముద్దలు చేసి నోటఁబెట్టుటను వేఱొకటియు నై సోమరితనమును హెచ్చించుచున్నవనుటకు సంశయములేదు. కనుకనే ప్రతికార్యమునకును యంత్రసాహాయ్య మపేక్షింపక చేతిపను లభివృద్ధిసేయవలసినదని యిది సిద్ధాంతితము. ఇట్లే పైనుదహరింపఁబడిన యెల్లవిషయములును జక్కఁగాఁ జర్చించి సిద్ధాంతీకరింపఁబడియున్నయవి. ఈపుస్తకము వెల 0-4-0. వలయువారు కాకినాడకు గ్రంథకర్తపేర వ్రాసికొనవలెను. హరిశ్చంద్రరావుగారిట్టి యర్థశాస్త్రము యొక్క తక్కటి భాగములను ద్వరలోఁ బ్రచురింతురుగాకయని ప్రోత్సాహపఱచుచున్నవాఁడను.

కాశీక్షేత్రమందైన యఖిలభారతవర్షీయ బ్రాహ్మణ మహాసమ్మేళనమున విచారించుట కేఁబడిన ప్రశ్నలకుఁ బ్రత్యుత్తరసంగ్రహము.

[ఒకటవ సంచిక తరువాయి]

—* ౬ తిరువాడి విద్యాలయపండితులందఱును *—

ఆపత్కల్పముచేనైనను స్త్రీలకు రజోదర్శనానంతరవివాహము సంభవింపదు.

—♦ ౭ మాయూర శివరామకృష్ణశాస్త్రిగారు ♦—

కాలస్థితిననుసరించి పురుషులు ౨౦ యేండ్లకుఁబైని వివాహము చేసికొనఁగూడదని నియమించుట యత్యావశ్యకము. ఆపత్కల్పతచేనైనను శూద్రులలోఁ దప్ప బ్రాహ్మణులలో ఋత్వనంతరవివాహము చేయఁగూడదు. రజస్వలయైనస్త్రీ వృషలియను వచనములకుఁ బ్రాయశ్చిత్తములేకుండ నట్టిస్త్రీని సంఘమునఁ జేర్చుకొనఁగూడదని యభిప్రాయము.

మన్వాదులకుఁదప్ప నిప్పటి ధర్మశాస్త్రవిదులకు ధర్మసంకోచముచేయుటయందును నధికారములేదు.

౨ సం॥ లకుఁబైని మ్లేచ్ఛసంసర్గముచేసినవారు ప్రాయశ్చిత్తశుద్ధులు కానేరరు. అంతకుఁదక్కువకాలమైనను నొక్కసంవత్సరము సామాన్యసంసర్గమొనరించినవారే ప్రాయశ్చిత్తార్హులును సంఘమునఁ జేర్చుకొనఁదగినవారును. తదనంతరము ప్రాయశ్చిత్తమున కర్హులైనను సంఘమునఁ జేర్చుకొనఁదగరు.

వ్రాత్యుని వదలివేయవలసినదే కాని యొకతరమువఱకైనను సంస్కారము పనికిరాదు. (సశేషము)

అభూతకల్పన.

ఈ సంవత్సరము మార్చి నెలలో స్వతంత్రయను నెల్లూరు పత్రికలోనను ద్రిలింగయను మదారాసు పత్రికలోనను (శ్రీపుష్పగిరి పీఠమును ప్రస్తుతమధిష్ఠించిన స్వాములవారు కొలంది కాలములోఁ బీఠాధికారమును వదలుకొని తపస్సు చేసికొందురనియుఁ గొన్ని సంవత్సరములు పీఠము నధిష్ఠించినందుకు వారికి ప్రతిసంవత్సరము రెండువేల రూప్యము లొసంగబడుననియు—పీఠమునకు మరియొకరు నియమింపబడుదురనియు ఈవిధముగా శృంగగిరివారు వీరిని నియమించిరనియు) ఒక సంగ్రహవార్త ప్రకటింపబడినది—దీనినిజమేమైయుండునని మేము విమర్శించితిమి — శ్రీజగద్గురుపుష్పగిరిపీఠాధ్యక్షులగు శ్రీమదభినవోద్దండ శ్రీవిద్యానృసింహస్వాములవారు నైజాము రాజ్యమున సకల వైభవములతో సంచారము చేయుచున్నారు. దేశస్థులందరు వారిని సాక్షాచ్చంద్రమౌళీశ్వరస్వామిగా భావించుచున్నారు. వారు తపోవంతులు పండితులు ఉపశాంతులు వారిని నియమించుటకు శృంగగిరి వారికిగాని మరియొకరికిగాని యెట్టియధికారము లేదు.

పీఠములకు దేశవిభాగము కలదు. కర్ణాటదేశము శ్రీశృంగగిరి పీఠసంచారభూమి - ఆన్ధ్రదేశము శ్రీపుష్పగిరిపీఠసంచారభూమి. ఎవరి దేశమునకువారు స్వతంత్రులు. నియమ్యనియామకత్వములు లేవు.

శ్రీపుష్పగిరి సంస్థానమందు ద్వేషభావముగల దుర్జనులెవ్వరో ఇట్టి వ్యాసము నాపత్రికల కంపియుందురు. నిజమును విమర్శింపక వారు ప్రకటించిరి. గురుభక్తులిది యంతయు నభూతకల్పనయని గ్రహింతురుగాక.

సదరు పత్రికాధిపతులు వ్యాసములువ్రాసినవారి పేరులం బ్రకటింప బ్రార్థితులు.

సత్యవాది.

వేంకటగిరిప్రస్థానము.

బ్రహ్మశ్రీ కావ్యకలానిధి శతావధాని పిసుపాటి చిదంబర శాస్త్రిగారు వేంకటగిరిసంస్థానమునకు దయచేసి శ్రీ శ్రీ వేంకటగిరి మహారాజా వారి సమక్షమున అష్టావధానము గావించిరి. శ్రీశాస్త్రి గారి యాశుకవితాశక్తియును ధారణాప్రభావమును శ్రీ మహారాజా వారికి మహాశ్చర్యము కలిగించినవి. అనేకస్థలములలో సంపూర్ణశతావధానములు నిగ్రహముగా నుభయభాషలలోను నెఱవేర్చి లోకప్రఖ్యాతిగాంచి అనేకమహారాజులను సంతసింపఁజేసి బిరుదములును శ్లాఘాపత్రికలును సన్మానములు వడసి మన ఆంధ్రదేశమునకొక అలంకారముగానున్న శ్రీ చిదంబరశాస్త్రిగారి ప్రతిభావిశేషమును గూర్చి నేనంతగాఁ జెప్పఁజాలను. వారి ఉభయభాషాగ్రంథములును వారి యవధానసభాసన్మానములే ప్రకటీకరించుచున్నవి. శ్రీ మహారాజుగారు అవధానానంతరము శ్రీశాస్త్రిగారికి నూటపదాఱులు మహానందముతో సన్మానముగావించిరి. సన్మానానంతరము శ్రీశాస్త్రి గారు శ్రీ మహారాజావారింగూర్చి చెప్పిన పద్యములు స్థాలీపులాకన్యాయముగ కొన్ని ప్రకటించుచున్నాను. చిత్తగింపుఁడు.

క|| గోవిందకృష్ణయాచ
మ్మావల్లభ ! తగినసభను జరిగించి వెసన్
గావించిన బహుమానము
భావమున జనింపఁజేసెఁ బ్రమదము నాకున్||

క|| దశదిక్తటసంస్థాపిత
యశస్కుఁ జతురాత్మజునకు నాప్తైకసుతా
కుశలునకు విజయ మభినవ
దశరథునకు వేంకటగిరి ధరణీంద్రునకున్||

సీ॥ రాజ్యంబునకు లోటురాకుండ రాజకా
ర్యములెల్లఁ దనకుఁదా నరయువాఁడు
ధర్మమార్గము సుంత తప్పునేమోయని
పండితగోష్ఠిలో నుండువాఁడు
ఆయంబునకు మీఱినట్టి వ్యయంబు నె
న్నండేనియును జేయకుండువాఁడు
ప్రకృతిరంజనము కార్యము తనికని సర్వ
జనులకు సంతుష్టి సలుపువాఁడు

గీ॥ ప్రభువు మీతండ్రి రాజగోపాలకృష్ణ
యాచభూపాలుఁ డానీతి ననుసరించి
వర్తిలఁగదయ్య వెల్గోటివంశవార్ధి
చంద్ర ! గోవిందకృష్ణయాచక్షితీంద్ర !

గీ॥ విభుఁడు సర్వజ్ఞసింగభూవిభుఁడు ధర్మ
చరుఁడు వేంకటగిరిరాజ్యసౌధమునకు
నిలిపినట్టి యశస్స్తంభములకుఁ బాదు
కదలనీయకుమయ్య వేంకటగిరీంద్ర ! ॥

కం॥ నీకును నీకొమరులకును
నేకాలమునందుఁగూడ నీశ్వరుఁ డిచ్చుం
గాక మహైశ్వర్యము బహు
లోకస్తవనీయమగువిలోకన మధిపా ! ॥

కం॥ పండితసంస్థానంబని
యుండెడి పూర్వప్రతిష్ఠ కుర్వీశ్వర ! యె
న్నండెట్టిలోపమును రా
కుండఁగఁ గాపాడికొనుచు నుండుము నెమ్మిన్ ॥

కం॥ నీతనయు లధికశక్తిస
మేతులు దీర్ఘాయులగుచు నీశ్వరకృపచే
భూతలము నేలుకొనియెడి
స్వాతంత్ర్యముఁవడసి యెన్నఁబడుదురుగాతన్ ॥

ఇట్లు చక్కని కవితాశుద్ధికలిగిన శాస్త్రిగారు తాము రచియించెడి పద్మపురాణము శీఘ్రకాలములో పూర్తిగావించి ఆంధ్రలోకమునకు అమూల్యమగు నుపకారము గావింపఁగలరని దృఢముగా విశ్వసించుచున్నాను.

(పురవాసి)

నూతనవిమర్శనము.

(గురుశిష్యులు ప్రవేశింతురు.)

గురు॥ శిష్యా! నిన్నుఁజూచి చాలకాలమైనది. నీవిప్పు డెక్కడనున్నావు ? ఏమికథ ?

శిష్య॥ గురువుగారూ ! నమస్కారములు. నేను ప్రస్తుతము పీఠికాపురమున నున్నాను. గ్రంథములు విమర్శించుచున్నాను.

గురు॥ నాయనా ! మొన్న నాయొద్ద రెండుకావ్యములు చదివి దానిలోఁ బ్రవేశముకాక తెనుఁగులో స్వయంకృషికి మొదలుపెట్టి యొకచోట వేయవలసిన యర్ధానుస్వారము వేఱొకచోటను నొకచోటనుండవలసిన శకటరేఫము వేఱొకచోటను దగిలించుచు, "శస" లకును "థధ" లకును భేదమున్నదను కర్మమైన నెఱుంగక పిచ్చిపిచ్చి వ్యాసములు గిలుకుచుండెడి నీ వింతలో నెంతవాఁడవైనావోయి.

శిష్య॥ స్వామీ ! జ్ఞానముమాత్రము మీయనుగ్రహమువలన నిప్పటికిని నట్లేయున్నదికాని నాకంటెఁ బనికిమాలిన కొందఱుపెద్దలు నావ్రాఁతలు చూచి సంతోషించుచుండుటచేతను నేను గొప్ప

వాఁడ నైతినేమో యని యనుకొని గ్రంథవిమర్శనములు చేయఁ గడంగినాఁడను.

గురు॥ మంచిది. మంచిపనియే చేయుచున్నావు. కాని యేగ్రంథము విమర్శించుచున్నావు ?

శిష్య॥ అయ్యా ! పాణినీయము విమర్శించుచున్నాఁడను.

గురు॥ కొంపదీసి పాణినీయమునే విమర్శింపఁబూనుకొంటివా ?

శిష్య॥ చిత్తము, చిత్తము.

గురు॥ నాయనా ! ఎట్లువిమర్శించుచుంటివో కొంచెము చెప్పెదవా ?

శిష్య॥ వినుఁడు. చెప్పెదను. పాణినీయవ్యాకరణమున సూ॥ స్త్రీపుంవచ్చ ౧. ౨. ౬౬ అని యున్నది. దీనింబట్టిచూడఁ బాణిని కాలములో స్త్రీలు పురుషులవలె నుండువారనియుఁ జకార స్వారస్యమువలనఁ బురుషులు స్త్రీలవలె నుండువారనియుఁ దేలుచున్నది.

గురు॥ నాయనా! పూర్వమునుండి నేఁటివఱకును నెందఱో వైయాకరణు లేర్పడిరి కాని యీసూత్రార్థము వారి కెవ్వరికిని గోచరించినది కాదు. నీ కింతటి ప్రజ్ఞావిశేషము దయచేసిన కలిపురుషు నవలెఁగాని నిన్ననవలసినది లేదు. మఱియొకటి చెప్పుము.

శిష్య॥ సూ॥ అంతర్బహిర్భ్యాం చ లోమ్నః ౫. ౪. ౧౧౭. అని యున్నది. దీనిం బట్టిచూడఁ బూర్వకాలమున నిప్పటికాలము కంటె జంతువులకంతటను రోమములుండెడివని తేలుచున్నది. అంతర్బహిర్భ్యామని చెప్పుటవలన శరీరబహిర్భాగమందే కాక శరీరాంతర్భాగమందుఁగూడ రోమములున్నవని దృఢముగా నొక్కి చెప్పవలసియున్నది. దానికి దృష్టాంతము నేనొకటి కనిపెట్టియున్నాను. చూడుఁడు. ఒకప్పుడు మనకుఁ బ్రేఁపు వచ్చినప్పుడు వెండ్రుకలు కాలినవాసన వచ్చును. గర్భములో నుండెడి జఠరాగ్నిస్పర్శవలన వెండ్రుకలుకాల నావాసన వచ్చునని కనఁబడుచున్నది.

గురు॥ ఆహా నీబుద్ధిబలము వర్ణనాతీతము నాయనా !

శిష్య॥ స్వామీ! మఱియొకటి వినుఁడు. సూ॥ న దధిపయ ఆదీని ౨. ౪. ౧౪ అనియున్నది. దీనింబట్టిచూడఁ బాణినికాలమునఁ బెరుగు పాలు మున్నగు పదార్థములు లేవని తేలుచున్నది. గురువుగారూ! మనమాలోచింతము; ప్రాచీను లెల్లరును మద వికారములకుఁ గారణములనియో లేక యజీర్ణవ్యాధికిని జైత్య మునకును గారణములనియో దధిక్షీరములను విసర్జించియుండు దురు. అందువలననే పాణిని యథాస్థితిని దనసూత్రమునఁ జెప్పి నాడని నాయభిప్రాయము.

గురు॥ నాయనా! నీయాలోచనకుఁదోడు నాయాలోచనగూడ నెం దుకు? నీవంటి నవనాగరకులు దేశమున లేకపోలేదు. వారలే నీయభిప్రాయములో నేకీభవింపవలయు.

శిష్య॥ స్వామీ! ముఖ్యమైనవిషయము చివర దొక్కటి వినవలయు.

గురు॥ నన్నింతటితో విడిచిపెట్టుము నాయనా! ఈ కాలములో నెవ రికిఁ దోఁచినట్లు వారు ప్రేలవచ్చును. నోటికి హద్దును బద్దును నక్కఱలేదు. ప్రమాణమంతకుముందేపః కిరాదు. మీయిష్టము వచ్చినట్లు దగ్ధము చేయుఁడు. ఎవరికేమి కావలయును.

శిష్య॥ స్వామీ! మీరు కోపగింపవలదు. నా చివరమాట యొక్కటి వినుఁడు. ఇదియే హైకోర్టుజడ్జి రామేశముపంతులు మున్నగు వారుకూడఁ దెలిసికొని లోకమున కిప్పుడు బోధించుచున్నారు. ఇది ముఖ్యముగా వినవలసిన విషయము.

గురు॥ అది యంతవారుకూడ స్వీకరించినవిషయమూ? అట్లైనఁ జెప్పు ము. ఇప్పటికైన యనర్థాపార్థ శ్రవణమువలన సంపాదించు కొనిన పాతకముకన్న నెక్కువసంపాదించుకొందునా? కానిమ్ము.

శిష్య॥ సూ॥ ఏకో గోత్రే ౪-౧-౯౩ అని యున్నది, దీనింబట్టిచూడఁ బూర్వకాలమున వంశమం దొకనికన్న నెక్కువగానుండెడి వారు కారని తేలుచున్నది. నిజముగా నాలోచించినను వంశ మం దొక్కఁడుండినచోఁ జాలునని యే నాకును దోఁచుచున్నది.

పలుమందికలరేని దాయభాగవిషయమునఁ గలహములు పుట్టు టయు భాగము చాలకపోవుటయు దేశాంతరమునకేగి జీవనముకొఱకు నానాకష్టములు పడుటయుఁ దటస్థింప వలసి వచ్చును. కావుననే హైకోర్టు న్యాయాధికారి రామేశము పంతులు మున్నగు ప్రముఖులు సంతానము నెక్కువగాఁ గనరాదనియు దాని నెట్లని ప్రతిబంధింపవలయుననియుఁ బాశ్చాత్యులుకూడఁ దమగ్రంథములలో నిట్లే వ్రాసిరనియు నది మన భారతదేశమునఁగూడ నాచరణములోఁ బెట్టింప వలయుననియు ననేకవిధములుగాఁ బోరాడుచున్నారు.

గురు॥ నాయనా! నీయుపన్యాసమునకు సంతసించితిని. ఈయర్థములు గోచరింపవలెనన్న సామాన్యములుకావు. ఊహాపోహాలకు నీకుఁదోడుగా నింకెవరైనను గలరా?

శిష్య॥ గురువుగారూ! నాబుద్ధి పాదరసముతో సమానముగఁ బ్రవహించెడిది. నాకు మఱియొకరి సహాయమేటికి. కాని మొన్న మొన్ననే బ్రహ్మశ్రీ పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి గారు శ్రీమహాభారతచరిత్ర మనునొక భారతవిమర్శన గ్రంథమును బ్రకటించియున్నారు. దానిలోఁగూడ నిట్టియూహలే కొన్ని కనుపట్టినవి.

గురు॥ నాయనా! దానిలోనిదికూడ నొకటి వినిపింపుము. కృతార్థుఁడనై వెళ్ళెదను.

శిష్య॥ చిత్తము. మహాభారతచరిత్రమున ౫౦ వ పుటలో "పాణిని కంటె శాకటాయనుఁడు ప్రాచీనుఁడనుటకుఁ బాణిని శాకటాయను ననేకసారులు తన వ్యాకరణమున పేర్కొనుటయే నిదర్శనము. అట్టి శాకటాయనుడు పాణినికూడ తమ వ్యాకరణములో పెక్కుసారులు యవనశబ్దము లుచ్చరించియున్నారు. పాణిని శాకటాయనులచే పేర్కొనబడిన యవనులనే మహాభారతగ్రంథకర్తయు తన గ్రంథమున పేర్కొనెను. పాణిని శాకటాయనులచే మహాభారత గ్రంథములలో పేర్కొనబడిన

యవనులు గ్రీసుదేశీయులా ? వారిలిపి దుష్టలిపి, దీనికి దృష్టాంతము. సూ॥ యవనయవా ల్లిపి దుష్టే, ౧-౩-౫౬ శాకటాయనవ్యాకరణం. సూ॥ ఇంద్ర వరుణ భవ శర్వ రుద్ర మృడ హిమారణ్య యవ యవన మాతులాచార్యాణా మానుక్॥ ౪-౧-౪ పాణి న్యష్టాధ్యాయి, వారు ముండనమును భారతీయాచారవిరుద్ధముగా చేయించుకొనుచున్నారు. సూ॥ ౨-౧-౭౨ అష్టాధ్యాయియొక్క మయూరవ్యంసకగణమును చూడుడు. శాకటాయనుడు లిపినిమాత్రమే పేర్కొనినాడు, పాణిని లిపిని వృత్తిని ఆచారమునుకూడ పేర్కొనినాడు ” అని యున్నది. ఎంతవిషయమో చూచితిరా.

గురు॥ నాయనా ! శిష్యశిఖామణీ నీయుహాలకుఁ దగినగ్రంథమే లభించినది. ఆయన యాగ్రంథవిషయము లన్నియు నిట్లే వ్రాసి యుండునా ? ఆవిషయము లేవి ?

శిష్య॥ పాశ్చాత్యులుచెప్పెడిమాటలను బురస్కరించుకొని కొన్నియుఁ బాశ్చాత్య గ్రంథములను బ్రమాణీకరించుకొని కొన్నియు, బ్రాహ్మణేతర సంస్కారముల ననుసరించి మఱికొన్నియు నిప్పుడు నేను బాణినీయసూత్రములను విమర్శించినట్లే యూహల నాధారముచేసికొని మఱికొన్నియు, వ్రాసిన విషయము లందులోఁ గనఁబడుచున్నవి. అవియన్నియు మాబోటి నవనాగరకులకును సంస్కృత మర్థముచేసికొనలేని వారికిని సంఘసంస్కర్తలకును వేదశాస్త్రప్రామాణ్యము నంగీకరింపనివారికిని రుచించునుగాని ప్రాచీనమార్గావలంబులగుపండితులకు రుచింపనేరవు.

గురు॥ నాయనా ! మీబోటి మహాత్ములగు విమర్శకులు బయలు దేఱుటవలననే సంస్కృతము మృతభాషయని పేరుపడి కాననాంతరములకుఁబోయినది. కానిచో నిట్టి పాపభీతియైన నున్న వాఁడు వ్యాకరణములకుఁ గూడ నిట్టియపార్థములు కల్పించి తమకుఁ గనులు లేనియట్లే లోకమునకుఁగూడఁ గనులు లేవని

భావించి వ్రాయ సాహసించునా? భారతభూమి యిప్పటి కైనను బండిత శూన్యము కాలేదే. ఎంతసాహస మెంత సాహసము.

శిష్య॥ స్వామీ! ఏమి యట్లనెదరు?

గురు॥ ఏమియా! వినుము "యవనయవా ల్లిపిదుష్టే" యను శాకటాయన వ్యాకరణసూత్రమునకుఁ బెద్దలు నిర్ణయించిన యర్థమున్నది. యవనుల లిపి యను నర్థము చెప్పినప్పుడు యవన శబ్దముః కానుగాగమమును జీష్ప్రత్యయమును వచ్చి "యవనానీ" యనురూపమగును. దుష్టమైనయవలు (ధాన్యవిశేషము) అను నర్థము చెప్పినప్పుడు యవ శబ్దమున కానుగాగమమును జీష్ప్రత్యయమును వచ్చి "యవానీ" అను రూపమగును. పాణిన్యష్టాధ్యాయిలోని "ఇంద్రవరుణ...... మానుక్" అనుసూత్రమునందు యవయవనశబ్దములకుఁగూడఁ బైవిధముననే యగును. వైయాకరణసిద్ధాంత కౌముది చూడవలెను. తెలియనిచోఁ దెలిసినవారి నడుగవలెను. కాని యథేష్టముగా వ్రాసినచో నిహాపరములకు దూరులగుదురు. మఱియును మయూరవ్యంసకాదిగణములో "యవనముండ, కంభోజముండ, ఛాత్రవ్యంసక" ప్రభృతిశబ్దము లనేకములు కలవు. వానిలోని యవనముండశబ్దమునకు, వారట్టు లర్థకల్పనము చేసినచోఁ గంభోజముండశబ్దమునకును ఛాత్రవ్యంసక శబ్దమునకును నేమియర్థము చేయవలసియుండునో చూడుము. భారతీయులగు కంభోజులుకూడ వారు చెప్పిన యర్థమునకు గుఱి కావలసియుండును కదా! మఱియు ఛాత్రులు (విద్యార్థులు) కూడ ధూర్తత్వమును వృత్తినిగాను ఆచారమునుగాను వహింపవలసియుందురుకదా? వ్యాకరణము శబ్దనిష్పత్తికొఱ కేర్పడినది కాని యిట్టి యపార్థములను జెప్పుటకుఁ గాదని దృఢముగా నెఱుంగవలెను.

శిష్య॥ అయ్యా! మొదట నేనుజేసిన పాణినిసూత్ర విమర్శనముకూడ నట్లేయున్నదా యేమి?

గురు॥ సంస్కృత గ్రంథమున నేమియో యెఱుఁగక సంస్కృతగ్రంథ విమర్శనమునకుఁ బూనుకొనెడివారి వ్రాఁతలును మాటలును నింతకన్న నెట్లుండఁగలవు నాయనా? తగినపదార్థములు లేనిచో వంటక మెట్లు దగ్ధమగునో తెలియదా?

శిష్య॥ అయ్యా! మహాభారతచరిత్రములోని విషయమింకొకటి యడిగెదను. అది యెట్లున్నదో నాకుఁ జెప్పుఁడు.

గురు॥ ఏదియో యడుగుము.

శిష్య॥ మహాభారతచరిత్రములో ౧౬౩ వ పుటలో "కొందరు యాదవకాంతలు కామాతురలై కిరాతుల గూడుటకు చెదరిపోయిరని" వ్రాసి దానికి దృష్టాంతముగా శ్లో॥ మిషతాం సర్వయోధానాం తతస్తాః ప్రమదోత్తమాః సమంతతో వికృష్యంత కామా చ్చాన్యాః ప్రవవ్రజుః ॥ మౌసలపర్వము ౭ వ అధ్యాయము శ్లోకము నిచ్చిరి. దీనితాత్పర్య మేమియో చెప్పుఁడు.

గురు॥ "పృష్ఠతాడనే దంతభంగః" అనునట్లు వా రుదాహరించిన శ్లోకమునకును వ్రాసిన యర్థమునకును నేమియు సంబంధము లేదు. అర్జునుఁడు మహాప్రళయము తటస్థించునని యాదవకాంతలను ద్వారకనుండి తీసికొనిపోవుసమయమున మార్గమధ్యమునందుఁ జోరు లడ్డపడి పతివ్రతలగు నాయాదవకాంతలను గొందఱను జిక్కులుపెట్టిరి. మఱికొందఱు యాదవకాంత లెవరికిఁ దోఁచినట్లు వారు ప్రాణమానములను గాపాడుకొనుటకు యథేచ్ఛముగాఁ బాఱిపోయిరి. అని ప్రకరణము ననుసరించియు సందర్భము ననుసరించియు నర్థము వచ్చుచున్నది. నాయనా! మహాభారతమనఁగా సముద్రమువంటిది, దానిలో నొక్క శ్లోకమునకు నిజమైన యర్థము రావలయు

నన్నచోఁ బూర్వాపరభాగ పరిశ్రమ మెంతయో చేయవలెను. గ్రామము మునిఁగిపోవుకాలమున మహాదుఃఖముతోఁ బ్రాణ రక్షణార్థ మన్యస్థలమునకుఁ బోవుచుండఁగా నడుమఁ జోరులు తటస్థించినపు డేకాంతకైనను మన్మధవికారము కలుగునా? అట్లు కలుగుటయే కాక యాచోరులనే కూడుటకుఁ గామాతురలగుదురా? మఱియు, ఆశ్లోకముననే "ప్రియదోత్తమాః" అని ఉత్తమశబ్దము వేసి యా యాదవకాంత లుత్తమస్త్రీలని కూడఁ జెప్పియున్నాఁడు. అదియయిన గమనింపవలదా?

శిష్య॥ స్వామీ! మీ రొక్కమారు మహాభారతచరిత్రమును జూడ వలెనని ప్రార్థన.

గురు॥ నాయనా! స్థాలీపులాకన్యాయముగా నీవుచెప్పిన ప్రస్తుత విషయములను బట్టియే యాగ్రంధము చూడనక్కఱలేదని నాకు స్ఫురించుచున్నది. నీవుకూడ నీవ్యాకరణవిమర్శనగ్రంధము నచ్చొత్తింపలేకపోతివా?

శిష్య॥ స్వామీ! మీపరిహాసవాక్యములను జూడఁగా నాకు సిగ్గగుచున్నది. ఇఁక నే నేమని ముద్రింపఁజేయుదును?

గురు॥ నాయనా! తగినసామగ్రి సంపాదించుకొనక పిచ్చిపిచ్చివ్రాఁతలు ప్రకటించి లోకమున నప్రతిష్ఠ పాదుకొల్పుటకంటెఁ దనకుఁ దెలిసినంతవఱకే వ్యవహరించుచు మహానర్థములకుఁ బాల్పడకుండ నుండువాఁడే మతిమంతుఁడని నాకు గోచరించుచున్నది. సంధ్యావందనకాలమైనది. నేనిఁక నిచ్చట నుండుటకు వీలులేదు. ఏగుచున్నాఁడను.

శిష్య॥ చిత్తము. తాలూకాబోర్డు ప్రసిడెంటు నాయుఁడుగారు టీపార్టీకి నన్నాహ్వానించియున్నారు. వేళయైనది. నేనుగూడ నేగవలయు. మీరు దయచేయుఁడు. (ఇద్దఱు నిష్క్రమింతురు.)

శ్రీమత్పరదేవతాయై నమః.

ఆరోగ్యకామేశ్వరి

శా॥ అంబా! నాకుఁగుమారుఁడంట? భవదాఖ్యన్ దాల్చువాఁడంట? వా
నిం బీడించెడినంట? దగ్గోకఁ డీఁకేని న్నికటాంతుంబు మ
మ్మం బోషింపక తీరదమ్మ? యివిగో? మ్రొక్కుల్ భవత్ప్రేమ మా
లంబం బిత్తటిఁ గావలెన్ వలవ దాలస్యంబు కామేశ్వరీ ॥ ౧

శా॥ ఎన్నో మందుల నెందఱో భిషజు లెన్నో భంగులన్ జెప్ప నే
నన్నింటిన్ దగ వాడిచూచితిని, గానైతిన్ గృతార్థుండ, నా
కన్నమ్మన్నను దప్పియన్న రుచిలే దాత్మోద్భవుం డార్తుఁడై
యున్నన్, వీని నరోగుఁ జేయుటకునై యోజింపు కామేశ్వరీ ॥ ౨

శా॥ ఏదోచి కుక్కుదయింప నిన్నడుగుటే యే నేర్తు నప్పట్టునన్
నాదైన్యమ్మును బాపి నీవు కరుణ న్మన్నించి రక్షింతు, నీ
పాదంబే శరణంబు పుత్రుని సుఖింపన్ జేసి రక్షించి యా
మోదం బీఁగదవమ్మ? నాకు సతతంబుం దల్లి? కామేశ్వరీ ॥ 3

మ॥ చిరకాలమ్మున కిచ్చి తాత్మజుని నీచిత్తమ్మెటో వచ్చి నీ
చరణారాధన సల్పి పేరిడితి నిచ్చల్ వానిఁ గామేశ్వరున్
బరిపీడించునె? దగ్గోకం డయినచో భక్తార్తిసంహార్త్రి? నీ
బిరుదం బేగతి సార్థకం బగుఁ గృపాబ్ధీ? తల్లి? కామేశ్వరీ॥ ౪

శా॥ నావంశమ్మునఁ దల్లివంగడమున న్నానాఁడు పూర్వమ్మునం
దేవంకన్ వినరాదు శ్వాసరుజ యీఁ డిద్దానఁ జిక్కెన్ గడుం
జేవల్ గూర్చి నిరామయున్ సలిపి రక్షింపంగ నీభార మిం
కేవైద్యమ్ములతోఁ బనే ముబుసుపోకే కాక కామేశ్వరీ ॥ ౫

మ॥ భయముం దైన్యము నా యెఱుంగనివి నా బాల్యమ్మునందుండి ని
శ్చయ మీసంగతి నీ వెఱుంగుదువు; మార్జారంపుదుర్ధ్యాన మె
చ్చయి యిబ్బాలునికంఠమందు వినరా నల్లంతనే నాకు నీ
రయిపోవు న్నిలువెల్లఁ గుఱ్ఱనికి సౌఖ్యం బిమ్ము కామేశ్వరీ ॥ ౬

మ॥ తనుసౌఖ్యం బది నాకుఁ దక్కువయినన్ దర్పమ్ము గోల్పోవకే
జననీ ? కాలము పుచ్చుచుంటి, సుతుమార్జారంపుదుర్ధ్యాన మీ
నను నిర్దర్పునిఁ జేయఁబూనె మిగులం బ్రార్థింతు నీపిల్లికూఁ
తను దూరంబొనరించి పుత్రునకు మోదం బిమ్ము కామేశ్వరీ ॥ ౭

మ॥ "జయ మెంతెందును దా వహించుటయు నిచ్చల్ పుత్రుచేతన్ బరా
జయముం బొందుట హర్ష" మన్ననుడి కీసారస్యముం గూర్చుటా
శయ వేదుల్ విని సమ్మతింపరు కలాసంపత్తి నాకుం బరా
జయముం గూర్పుము పుత్రుచే రుజను నిష్కాసించి కామేశ్వరీ ॥ ౮

మ॥ నరకం బిచ్చెదొ? మోక్ష మిచ్చెదొ? తుది న్నాకీవు నాతల్లి? యీ
గుఱకన్ బిడ్డనిఁ జేరనీక యిఁక నాకున్ మోదముం గూర్చినన్
నరకమ్మున్ దరియించినట్లె మది నానందింతు బిడ్డండు శ్వా
సరుజ న్నెట్టిన నాకు నయ్యది యె మోక్షం బంబ? కామేశ్వరీ ॥ ౯

శా॥ అంబా? వైద్యుల కీరుజావిలసనం బడ్డంగ గడ్డంట? వై
ద్యంబుం బోలె భవత్కటాక్ష మసమర్థం బెందుఁ గాదంచు నా
కుం బాల్యమ్మున నుండి మేటిగుఱి నాకుఱ్ఱండు నీపేర్మిక
ల్మిం బీడన్ విడి సౌఖ్యముం గనుతఁ దల్లీ? యింకఁ గామేశ్వరీ ॥

శా॥ ఎంతో కార్యము కల్గి కాక వృథగా నే బద్యముల్ సెప్ప నా
చింతల్ దీర్చుట నీకు శక్యమనియే చెప్పన్ దొరంకొంటి నీ
స్వాంతం బించుక పుత్రుపై నిలిపి వాంఛాపూర్తి సేయంగదే ?
సంతానంబు నిరోగమైన భవమే స్వర్గంబు కామేశ్వరీ ॥ ౧౧

శా॥ పద్దెమ్ముల్ రచియించి కోరితి నిఁకన్ బ్రారబ్ధకర్మక్షయం
బిద్దానన్ గలిగించి వే సుతున కాయీరోగమున్ బాపి దీ
వ్యద్దేహుం బొనరించి ప్రోవుము కవిత్వం బిద్ది లోకమ్ములో
'సద్విద్యామథ' మన్న పేరున యశస్యం బౌతఁ గామేశ్వరీ ॥ ౧౨

శా॥ ఆయుర్దాయము లేని వారలకె త్వా నాయు స్సిడన్ భర్త, త
జ్జాయాత్వమ్మున కీవు తావలమవై సంపన్నమౌ నాయువున్
జేయన్ జాలవె రోగదూరముగ, నీచిత్తమ్మురా కిన్ని నా
ప్లాయాస మ్మొదవెన్ ఘటింపు మిఁక సౌఖ్యం బంబ? కామేశ్వరీ ॥

మ॥ శతకమ్మున్ రచియించి సూర్యుపయిఁ గుష్ఠ మ్మార్చె నొక్కండు, ప
ద్యతతి న్నిన్ను నుతించి మూఁగతనమున్ దాఁ బాసె నొక్కండు, ని
శ్చిత మీసంగతి, మున్ను నీకతననే జీవించితి న్నేను, మ
త్సుతు నారోగ్యము నీకతాన నగు టేచోద్యమ్ము ? కామేశ్వరీ॥

శా॥ అంబా? యెందుల కిచ్చి తిట్టిసుతు, నిన్నర్థింప లేదే? మనీ
షం బూర్ణుండని సంతసించితునో ? గురుశ్వాసార్తుఁ డంచున్ విచా
రంబుం బొందుదునో? షడబ్దముల కుఱ్ఱం డేడ? యీరోగదా
ష్ట్యంబుం దా నదియేడ? బిడ్డనికి సౌఖ్యం బిమ్ము కామేశ్వరీ॥ ౧౫

శా॥ పాపం బీయుది నాయొనర్చినదియో? బాలుండె తాఁ జేసెనో ?
రేపున్నా పిటులైన నెట్లు? లిది వారింపంగదమ్మా? సుదు
ప్ప్రాపం బుండదు నీకు, నీచరణమే పాహి, పన్యథా లేదు నా
తాపం బాపఁగదమ్మ? కుఱ్ఱనికి మోదం బిచ్చు కామేశ్వరీ ॥ ౧౬

మ॥ పడుల [illegible]ంయి లేక యిర్వురము నిన్ బ్రార్థించుచున్నార మీ
చెనురోగమ్ము దొలంచి పుత్రుని సుఖాశీర్వ్యక్తుఁ గావించి నా
మొదఁదన్ సంతసపెట్టు మన్యగతి లేకే నిన్ను యాచించితిన్
దడ వింకన్ బొనరింపకే యుడుపు నాతాపమ్ము కామేశ్వరీ ॥ ౧౭

మ॥ కొడుకుల్ గల్గనినాఁడు బుద్ధియయినన్ గొండంతగాకున్న న
ల్గడలన్ గొండొకతైన సాయపడి నాకార్యమ్ములన్ దీర్చుచుం
డెడి దీపుత్రకుఁ డుద్భవించియు రుజానిర్మగ్నుఁడై బుద్ధికిన్
దడఁబాటున్ ఘటియించెఁ గుఱ్ఱనికి మోదం బిమ్ము కామేశ్వరీ ॥

మ॥ మును పీరోగము "వెన్ను కొంతముదురన్ బోవున్ ధ్రువం"బంచుఁ జె
ప్పినవైద్యోక్తుల నూఱడిల్లితి నెటో వె న్నట్టులొ మీఁదఁ ద
గ్గనియాదగ్గన కేను బెగ్గడిలి నిన్ దక్కంగ వేఱొక్కది
క్కు నపేక్షింపనివాఁడనైతి ధృతి నాకున్ గూర్పు కామేశ్వరీ ॥

మ॥ అరిగెంబో? యయిదేఁడు లెల్లొ శశి యల్లంతన్ జనన్ బిమ్మటన్
ధరణీసూనుఁడు వచ్చె "నింక సురుఁగున్ ద" గ్గంచు నే నుండఁగా
సురుఁగన్ లేదు సరేకదా? మిగుల హెచ్చున్ జూపఁగాఁజొచ్చె నీ
కరుణాదృష్టియె పుత్రుఁ బ్రోవవలె నింకన్ దల్లి? కామేశ్వరీ॥ ౨౦

మ॥ జననీ ? యేఁబదియైనప్రాయమున నీసంతానదూరోగచిం
తను జేకూర్చుట నీకు ధర్మమగునే ? 'ధన్యుండు పీఁ' డంచు భూ
జను లెన్నన్ భవదీయసత్కరుణచే సంసారినై యుంటిఁ బు
త్రున కారోగ్య మొసంగి నన్ను నుతిపాత్రుం జేయు కామేశ్వరీ॥

శా॥ తల్లీ ? త్వత్పదభక్తులాజనుల సంతానం బరుగ్ణంబు సం
పల్లీలాకలితంబు నంచుఁ దెలుపున్ బ్రాచీనపుం గబ్బముల్
దెల్ల మ్మీనుడి మత్కుమారునెడ వర్తింపన్ వలెన్ దాన భ
క్తోల్లాసమ్ము ఘటింపఁగావలయుఁ జుమ్మోయమ్మ? కామేశ్వరీ॥

శా॥ భక్తుల్ రిక్తులైయై తదాత్మజులు సంప్రాప్తార్తులే యైనచో
'భక్తార్తిప్రద' వన్నదుర్యశము సంప్రాప్తించు నీకున్, ద్వదా
సక్తిన్ మానుదు రెల్ల, రట్లగుట నిచ్చల్ భక్తసంరక్షణా
సక్తిన్ వీడకుమమ్మ ? నీకిది యశస్యం బమ్మ? కామేశ్వరీ॥

మ॥ శని బల్ దోషి కుజుండు పాపి రవి దుస్సంచారి జీవుండు దు
ర్మనసుం డైననుతేమి నాకొమరు సంరక్షించుభారమ్ము నీ
పనియైనప్పుడు భీతి యేమిటికి ? నీపట్లన్ గ్రహంబుల్ భయ
మ్మున నీభక్తుల కిచ్చు నిచ్చలు సుఖంబుల్ తల్లి? కామేశ్వరీ॥ ౨౮

శా॥ ఈజన్మంబునఁ గొంచెమే యనుము ము న్నేజన్మమందేని నీ
పూజన్ బూర్తిగ సల్పె వీఁ డది కతమ్మున్ జేసియే లోకమున్
బూజించెన్ గొమరుండు రుగ్ణుఁడగు టే పో ? లోప మిప్పట్ల నీ
తేజంబే కల దద్ది పుత్రు సుఖిగా దీవించుఁ గామేశ్వరీ ॥ ౨౯

మ॥ ఇలువేల్పైనక తాన నీచరణమే యీడ్యంబు మావంశమం
దలి యేకూనకునైనఁ గాని యిది క్రొత్తా ? మాకొలమ్మెల్ల నీ
చలువన్ జేసియె వృద్ధిగాంచెఁ గొమరున్ సాకం గదమ్మా? రుజా
బలమున్ దింపఁగదమ్మ పుత్రుఁ గరుణింపన్ రమ్మ ? కామేశ్వరీ॥

మ॥ ఒకపూటో? యొకరేయియో? పగలో? యీయుద్రేకపుందగ్గు ద
గ్గక కుఱ్ఱండు సుఖమ్ముగా నెసఁగ ''మాకామేశ్వరీదేవి పు
త్రికు రక్షించె''నటంచు, మీఁద మరలన్ దగ్గన్ మొదల్వెట్ట " దే
వి కటాక్షింపద యింతదన్క—" ననుచున్ వీఁడుండెఁ గామేశ్వరీ॥ ౩౧

మ॥ జననీ లోకములోని బాలకులు నిచ్చల్ దగ్గరే? యట్లు ద
గ్గిన నే నింతగ మొఱ్ఱవెట్టెదనె? యీ కిగ్గాడిమార్జాల ని
స్వనము న్నే వినఁజాల, దీని నణఁగింపన్ లేవె? ని న్నేను వేఁ
డిన దీమాత్రముకాదె? నీ కిదియు గడ్డే? తల్లి? కామేశ్వరీ ॥ ౩౨

మ॥ అనిలో మున్ను బిడాలరాక్షసునిదుర్వ్యాహారముల్ రూపుమా
పినమాటే నిజమేని నేడు కొమరున్ బీడించునీపిల్లికూ
తను వారింతువు దానఁజేసి మ దపత్యం బున్నతానందమున్
గను నిన్నుం దనియింతు నే నపుడు వేడ్కల్ మీఱఁ గామేశ్వరీ॥

శా॥ "తగ్గుం ద"గ్గని యంటి "దేవిపయిఁ బద్యాల్ సెప్పినా"నంటి "వే
తగ్గుం గన్పడ దేమి? తండ్రి!"యనుచున్ దర్కించెఁ గుఱ్ఱాడు బల్
సిగ్గయ్యెం బెఱవారుగూడ వినుటన్ లేలెమ్మ రారమ్మ నా
సిగ్గు న్నాసుతుదగ్గునున్ దొలఁచి రక్షింపంగఁ గామేశ్వరీ॥ ౩౦

మ॥ చదువన్ వేయఁగ "యుక్తకాల"మని యాసంస్కారమాత్రంబ య
య్యాదనం దీర్చితిఁ; గుఱ్ఱనిం బడికి నే నానాఁటి కీనాఁటికిన్
"బ్రద"ముం చన్నది లేద, యన్నిటికి నీశ్వాసామయోద్రేకమే
కద? విఘ్నం, బిది వాపి విద్య నొసఁగంగాఁ జూడు కామేశ్వరీ॥

మ॥ ఎపుడో నీకృప రాఁ బ్రయోజనము లేదీబాలుపై విద్యనే
రుపుకాలం బది దాఁటిపోవుపయి నీ రుగ్ణత్వముం బాపి నీ
కృప సూచింతువు గాక యక్కరము లెక్కింపన్ గడుంజిక్కు, "గో
టిపనిన్ గొడ్డటి" కేల తార్చెదవు నేఁడే చూడు కామేశ్వరీ॥ ౩౨

శా॥ "ఆలస్యా దమృతం విషం" బనెడి సిద్ధాంతోక్తి నీ వొప్పుచో
బాలున్ వే గరుణింపు మమ్మ? సుకలాభ్రాజిష్ణుఁ గావింపు మ
మ్మా? లోకుల్ నను "నిదుభక్తుఁ" డనుచున్ మన్నించుసందర్భముల్
బాలింపంగదవమ్మ? నీయుపకృతిన్ వర్ణింతుఁ గామేశ్వరీ॥ ౩౩

శా॥ "ఎన్నం డీచెడుదగ్గు తగ్గు" నని న న్నెల్లప్పుడుం బృచ్ఛసే
యు న్నాబిడ్డఁడు "కొన్నినాళ్లు"కని నే నోదార్తు నవ్వాని, నా
పన్నార్తిప్రశమావధాయితము నీవాత్సల్య మీనాదును
క్తిన్నిల్పన్ వలె మత్కుమారకునియార్తిన్ బాపి కామేశ్వరీ॥ ౩౪

శా॥ అంబా? ని న్నెవఁ డేని నమ్మి చెడఁ డీయర్థమ్ము నాకుత్తమీఁ
దం బాటించిననీకృపాకలనచేతన్ విస్ఫుటం బయ్యెఁ బ
ద్యంబుల్ ముప్పదియైననాఁడు మొద లేతద్వ్యాధిభారంబు త
గ్గంబూనెన్ గొమరుండు గొంత సుఖిగాఁ గన్పట్టెఁ గామేశ్వరీ ॥

శా॥ ఇంతేకా దిటనున్న "మార్గమిది" యం చేర్పాటుగాకుండ నేఁ
డంతో యింతయొ మార్గ మేర్పడినయట్లైతోఁచె నీమార్గ మీ
కాంతారాంతరచారినైన ననుఁ జక్కన్ గమ్యమున్ జేర్చి దు
శ్చింతాదూరుని జేయుఁగాత మిదిగోఁ జేమోడ్పు కామేశ్వరీ॥ ౩౬

శా॥ ఇంత "న్నన్నను వీడు వీఁ" డనుచు నీ వీక్షింపఁగాఁబోకు నా
సంతానమ్మును బీడవెట్టురుజ నిస్సందిగ్ధమై వీడు న
ల్లంతన్ వీఁడు కవిత్వమున్ సలిపి నిన్ యాచించుటల్ మాను "దు
ష్యంతం" బన్నది "దాసరేః పదము" నేఁడా పుట్టెఁ గామేశ్వరీ ॥

శా॥ "సంతానమ్మ నొసంగితీరు" మని నిచ్చల్ నిన్నుఁ బీడింపలే
దెంతో కాల మపత్యభాగ్య మది లేకే యేగె, నల్లంతలో
సంతానంబఁట ? కొంత నష్టమఁట ? శిష్టమ్మిర్వు, రం దగ్రజుం
డంతే రుగ్ణతఁ గాంచఁ జూచి సయిరింతే? దేవి? కామేశ్వరీ॥ ౩౮

శా॥ దేనిన్ గ్రొత్తగ "నాకు ని"మ్మనుచుఁ బ్రార్థింప న్ననున్ దల్లి?, యె
ద్దాని న్నివిడితో ? యయాచితమ, తద్దన్ దానఁ దృప్తుండ నీ
వై నా కిచ్చినదానికే సుఖజయాప్రాగ్భార మర్థింతు, "నా
పై నీచిత్తము నాదుభాగ్యము" కృపన్ బాలింపు కామేశ్వరీ ॥

మ॥ తమకున్ దగ్గనిదానిఁ గోరుదురు సంతానంబు నెప్పట్లఁ బ్రా
జ్ఞమతుల్; దగ్గెడిదాని నెట్టికుమతుల్ గాంక్షింప రట్లౌట నో
యమ? యిందుంగల శ్లేష శ్లేష్మరుజయం దైనన్ సమర్థించి నా
కొమరున్ దగ్గనివానిఁ జేయు మది నాకున్ జాలుఁ గామేశ్వరీ॥ ౪౦

మ॥ 'తనకున్ దగ్గ' నియున్నచోట నుభయార్థమ్ముల్ "సుఖప్రాప్యముల్,
కమనీయమ్ములు" నంచు నీవరయుచోఁ గళ్యాణి? నాతోఁ గలన్
గొమరున్ దగ్గనివానిఁ జేయుటయు దగ్గున్ మాన్పుటల్ గూడ యు
క్తము, పైసంగతికేమి? దగ్గు నిపుడే తగ్గింపు కామేశ్వరీ॥ ౪౧

శా॥ అంబా? నీదగుభక్తమండలికి శ్రేయం బబ్బఁగాతన్ నిరో
గంబౌఁగాక తదాత్మజాతులకు; దీర్ఘంబైనయాయుష్యలా
భం బౌఁగావుత వారి కియ్యదియ నాబాలుర్ గృపన్ బ్రోచి న
న్నుం బాలించినదాని కేఁ దెలుపుసంతోషంబు కామేశ్వరీ॥ ౪౨

శా॥ అంబా? నీకు జయమ్ము, నీసుతుల కత్యారోగ్యమున్, నీమన
మ్ముం బాలించెడిశంభుదేవునకు నామోదమ్ము నీపాదయు
గ్మంబుం గొల్చెడిమాదృశప్రజకు సౌఖ్యం బీవు మత్పుత్రుపీ
డం బోఁద్రోయుటఁజేసి నాసలుపునాట్యం బిట్లు కామేశ్వరీ॥

శా॥ ఈవే పంపితొ? తాన వచ్చెనొకొ? దేవి? కేరళజ్ఞుండు చి
త్రావూర్యన్వయుఁ డర్చనాకుశలుఁ డారాధ్యస్వభావుండు సు
శ్రీవిష్ణుం డపమృత్యువారకుఁడు లక్ష్మీపత్యభిఖ్యుండు సౌ
ఖ్యావిర్భావుఁ డకారణంబ యిట, కంబా? నిన్న కామేశ్వరీ॥ ౪౪

మ॥ అతఁడేజాతకమున్ గనుంగొనక తా నాస్యమ్ము వీక్షించియే
గతమే కా కఖిలంబు నాగతము వక్కాణించువిజ్ఞుండు, మ
త్సుతునిం జూచి విశేషసంగతుల నచ్చుంగూర్చినట్టుల్ వచిం
చి తగన్ శాంతికినై కడంగె నిది నీచేయూఁత కామేశ్వరీ॥ ౪౫

శా॥ స్త్రీవిం గావు, పుమాకృతిం బొరయ, వీ చిహ్నద్వయాతీతమా
భావం బందవు, నిన్ను నెవ్వరని సంభావింతు నోతల్లి? భూ
దేవుల్ నీనిజరూప, మిందు నహి సందేహంబు, మత్పుత్రకున్
బ్రోవంగా నిటువచ్చి తాత్మకవితన్ మోమోడి కామేశ్వరీ॥ ౪౬

—♦ సచ్ఛూద్రులు. ♦—

వ॥ అనవుడు బ్రహ్మదేవుండు ౬౬౧

క॥ "సచ్ఛూద్రులు సహిత మతిస్వచ్ఛములగు వేదములను జదువందగ దో
సచ్ఛీల! నరకమునఁబడుఁ దచ్ఛ్రవణంబునన యేల తదుపరివార్తల్. ౬౬౨

పృథ్వి॥ పురాణపఠనంబునన్ మునివరేణ్య! తచ్ఛూద్రులా
చరింపఁదగదయ్య సంశ్రవణమున్ వినా యెంతయున్
ధరామరముఖంబునం దవిలి యర్థ వహా గ్రాహ్య మై
శ్రుతిన్ స్మృతుల విన్కియుం దగ దిఁకేమి వాక్రువ్వనా" ౬౬౩

వ॥ అని వక్కాణించుటయుఁ గలహాశనుండు వెండియు నిట్లనియె. ౬౬౪

తే॥ "ఎవరు సచ్ఛూద్రులను ఖ్యాతి నెనసినారొ వారి వివరించి చెప్పంగవలయు దేవ!
ఎవరు సచ్ఛబ్దమున వాచ్యు? లెవరు శూద్రులిలను సచ్ఛూద్రనామ మదెట్లువచ్చె?"

వ॥ అని ప్రశ్నించుటయుఁ బంకజాసనుండు ౬౬౬

తే॥ "తుల్యకులరూపయును దశదోషరహిత యయినకన్యక వేదోక్తమైనవిధిని
పరిణయంబైన శూద్రుండు ధరణిలోన నగును సచ్ఛబ్దపూర్వుఁ డ యనఁగుఁదనయా!

సీ॥ అంగంబులం దెందు హైన్యంబులేక పాతివ్రత్యంబువహియింపఁ జాలుదాని
కుష్ఠంబు మొదలైన గొప్పజాడ్యములచే నిందితగాకుండ నెగడుదాని
పలుకుపల్కినఁ దేనె లొలుకంగ మాటాడు చెంతయు లలితయై యొసఁగుదాని
దశదూషణములకు స్థానంబుగాకుండఁ జులుకుదనంబునం బరఁగుదాని
ఆగమోక్తవిధిం బెండ్లియాడినట్టి వాఁడు సచ్ఛూద్రుఁ డతఁడు దేవముఖులకు వి
భాగకృత్తగును దదూఢ పత్నియు మెల్లపుణ్యకృతులం బ్రకీర్తిత పుత్ర! వినుము.

వ॥ దానితోడం గూడి చేయు ధర్మంబు సంపూర్ణఫలప్రదంబు. ౬౬౭

సీ॥ మఱి నమస్కారాంతమంత్రపూర్వకముగఁ బంచయజ్ఞము లాచరించుకొనుచు
ఎలమి నిష్టాపూర్తములను శ్రాద్ధాదికంబులను శుద్ధుండయి సలుపుకొనుచు
భృత్యులు మొదలైన బీదజనంబుల సంరక్షణమునందు సక్తులగుచు
ఆమ్నాయవిధిఁ బెండ్లియాడిన స్త్రీతోడి రతమాత్రమునఁ దృప్తమతులగుచును
కృష్ణ పావననామ సంకీర్తనమ్ము నేమఱక చేయు శూద్రునియెడల దేవ
తలును సంతుష్టులగుదురు తనుభవా! విశేష మటు హరి పవళింప శేషశయ్య.

తే॥ ఆడుదియుఁ జేయనగుఁ బంచయజ్ఞముల నమంత్రకంబుగ నారదమౌనిచంద్ర!
పితరులకు దేవతలకును బ్రీతియగును బంచయజ్ఞంబులంబోలెఁ బతిసపర్య.

క॥ పతివ్రత దేహంబున దేవతలెల్లరు నుందురిగాన భార్యాభర్తల్
యుతులయిరె ధర్మకృతులను సతమున్ గావింపవలయు సంయమిముఖ్యా!
తే॥ ఉభయులుం గొల్చి యర్థింప నొసఁగినట్టు లొకరికొసఁగరు వేలుపు లోకుమార!
కాన నెల్లప్పుడుం బుణ్యకార్యములను సహితులైయుండవలయును సతియుఁబతియు
క॥ చాతుర్మాస్యంబున సంప్రీతి సతీపతులు గూడి విష్ణుని భక్త్య
న్వీతంబుగ సేవించుట యోతనయా! భవ్య. మేల యుక్తులు పెక్కుల్. ౬౭౪
తే॥ భర్తకున్న దర్ధభాగంబె తనమేన నపర మూర్ధమైన యాత్మకులజ
దర్ధకార్యమునకు నధికార మాపెది యగుట నర్థధర్మ మదె ధరించు. ౬౭౫
తే॥ ఎవతె మృతుఁడైన పతితోడ నెలమి ననుగమించు నాపె పతివ్రతయంచుఁదెలియు
ముద్ధరించును గులమంతయును గుమార! యాపె యాత్మీయమైన మహత్త్వమునను.
ఆ॥ అన్యజాతివాఁడె యగుఁగాక తనుఁ బెండ్లియాడినట్టివాని ననుగమించి
అగ్నిఁజొచ్చునట్టి యాసాధ్వి కులమెల్ల నుద్ధరించుఁజుమ్మ యోగిచంద్ర! ౬౭౬
ఆ॥ పుణ్యపురుషు లుదకముననుండి పాచిని దీరమునకు బలిమిఁ దీసినట్టు
లనుగమించువనిత యాత్మీయనాథు సముద్ధరింపఁగలుగు నోకుమార! ౬౭౭
క॥ ఒకజాతిపురుషుఁడును వేఱొకజాతి స్త్రీయుఁ బెండ్లి యొనరిచికొనినన్
బ్రికటంబగుధర్మక్రియ నిఁక వారియుభురును ద్యాజ్యు. లేమనవలయున్. ౬౭౮
ఆ॥ ఎవరివర్ణమునకు నేర్పడియుండిన యాసుకర్మములు సమాచరించి
యభమొ శుభమొ పొందనగుఁగాని సంబంధ మించుకయును నుండ దిద్దటికిని.
ఉ॥ ఎక్కువదానిఁగాని మఱి హీనకులోద్భవఁగాని పత్నిఁగా
నొక్కపుడుం బొనర్పఁదగఁ డుర్విని శూద్రుఁడటులొప్పనర్చి పెం
పెక్కఁడు. దానిఁగూడుకొని యేదియొనర్చినఁ గాదు తృప్తిదం.
బక్కట! తత్తనూజకృతమైనను నట్టులె వ్యర్థమయ్యెడిన్ ౬౮౧
ఆ॥ విలిచిచేసికొనిన జలజాక్షి దాసినా వాచ్యయగునుజుమ్మ వసుధలోన.
సంయమిప్రకాండ! సచ్ఛూద్రునధికారమందు మన దొకష్ఠ నష్పగాక్షి. ౬౮౨
క॥ ఏకన్నియ జనకునిచే శ్రీకరముగ నిచ్చి పెండ్లిచేయంబడునో
ఆకన్నియ పితృదేవార్చాకరణంబునకు నగును సాధక యెపుడున్. ౬౮౩
సీ॥ సల్లక్షణంబులు చాలంగఁగల్గియు వినయవిధేయతాన్వీతయగుచు
పతిమీఁద నత్యంతభక్తిగల్గినదయి సచ్చరిత్రముతోడ సహితయగుచు
సద్వంశమందున జనియించినట్టిదై మతిమతి శోభాయమానయగుచు

ధర్మకార్యంబులం దత్పరయయి వివేకముదొట్టిగుణములు గలదియగుచు
వెలయుకన్య ధర్మవిధిచేత సద్బ్రాహ్మణుఁడు పెండ్లియాడఁజనును సుత ! ప
వితములనుజేయుఁ బితృమాతృవంశంబు లట్టికన్య యేమియనుదు నీకను.

క॥ ఇదియే సద్బ్రాహ్మణులవిధి యదిచెప్పితి. వారికన్న నపకృష్టులకుఁ
పదితీరుల పెండ్లిండ్లును బదివిధముల తనుభవులును బరగెడి వినుమా. ౬౯౫

ఆ॥ నాలు గుత్తమములు నారద ! యవ్వివాహములలోన మిగిలినట్టి నాల్గు
హీనజాతివారి కేర్పాటుచేసిరి యాద్యులైన ప్రాజ్ఞు లది వచింతు ౬౯౬

సీ॥ తనయ ! ప్రాజాపత్యమును బ్రాహ్మమును దైవ మార్షంబు గాంధర్వ మాసురంబు
ప్రాతిభంబును మఱి పైశాచనామంబు ఘాతన రాక్షసాఖ్యములు పదియుఁ
అగునువివాహంబు. లౌరస క్షేత్రజుల్ క్రీత కానీనులు కృత్రిముఁడును
గూఢజ దత్త సహోఢజుల్ పౌనర్భవాపవిద్ధులు పదుం డాత్మజాతు.
లౌరసునికన్న హీనులైనట్టివారు హీనులకె పుత్రులై శుభ మీయఁగలరు.
ప్రకృతులుంబోలె నీచులు పదునెనిమిదిమంది తత్కారణీయధర్మములు వినుము.

సీ॥ విధియొండులేదుచూ వీరికిఁ బూజ్యులౌ క్షోణిదేవతల శుశ్రూషదప్ప
క్రియ యనుక్తం బీనికృష్టుల కెదియును నంబుజనాభు ధ్యానంబుదప్ప.
స్మృతి యెది విధియింప దితరంబు వీరికిఁ జంద్రశేఖరుని యర్చనముదప్ప.
మంత్రింబులనువీరు మదినైనఁ దలఁచు టక్రమమగు దానధర్మములఁదప్ప.
శ్రద్ధనొనరించు దానధర్మముల కెపుడు నాశముండదు లోకంబునం గుమార !
శ్రద్ధలేకుండ నశుచిత సల్పెనేని యగును వైరస్యకారణ మదియె తుదకు. ౬౯౭

తే॥ హీనకులులకును నహింస ధర్మంబు. మహాఫలప్రదంబు నందులోన
హరిపరుండ దేవతార్చకుఁడగుచు నహింసనూనఁ బున్నె మెన్నఁదరమె. ౬౯౮

క॥ అవిరోధులును సుదర్శను లవు సచ్ఛూద్రు లటు ధర్మ మనయము సేవిం
త్రివనీసురశుశ్రూషను నవితథమగు దానమునను యమికులచంద్రా ! ౭౦౦

తే॥ వృత్తి సచ్ఛూద్రజనులకు వృథగ నన్నృతములను బలుకక వాణిజ్యముం బొనర్పు.
టింక వడ్డిని నూటింటి కెనుబదియవ పాలు గైకొను టెంతయుం బాడియగును.

ఆ॥ క్షత్రియాదులందు సహాపాదవృద్ధి గ్రహింపఁబడెడి సంయమీంద్ర ! పుడమి.
ఇటులొనర్పఁ గలుగ దించుకయును బాపబంధ మొకపుడేని ప్రజల కరయ.

తే॥ కల్యమున దేవతాపూజ క్రమముగాను ధరణిసురసేవనంబు మధ్యాహ్నమందు
స్వకృతులన్నియు నపరాహ్ణసమయమందు సల్పునటువంటిమనుజుండు సౌఖ్యమొందు

సీ॥ గేస్తులైయనుచు సత్క్రియ లాచరించుచు నాతిథ్యమిచ్చుచు హరిఁ దలఁచుచు
పంచయజ్ఞంబులు భక్తిఁ గావించుచు దీనులం బ్రోచుచు దానమిడుచు
సాధులం గొల్చుచు సదపత్యముం గంచు ఋతువహించుచు సదాచారులగుచు
షడ్ద్వాదశాక్షరజప మొనరించుచుఁ ద్యక్తసంతాపమాత్సర్యులౌచు
శక్తికొలఁది భూతసంతృప్తిసేయుచుఁ ద్రయి పరింపకుండ ధర్మపరత
వర్తిలంగవలయు వసుధ సచ్ఛూద్రులు స్వర్గలోకసుఖము వడయుపొంటె. ౧౯౪
ఆ॥ అనయ మెవరు హరికి హరునకు భక్తులై యుంద్రొ వారు స్వర్గమందుఁ బోయి
యుండఁగలరు దేవతోత్తములుంబోలె హరిపరుండ నంత కతిశయంబు" ౧౯౫

— అష్టాదశప్రకృతులు —

వ॥ అని వక్కాణించుటయుఁ గలహాశనుండు వెండియునిట్లనియె ౧౯౬
క॥ "పదునెనిమిదిప్రకృతులటం చుదితమ్మవి యెవ్వి? వాని కుండిన ధర్మం
బెది? మఱియు వృత్తియెయ్యది విదితంబొనరింపుమయ్య విశ్వస్రష్టా!" ౧౯౭
వ॥ అనియిట్లు ప్రశ్నించుటయుఁ జతురాననుండు ౧౯౮
క॥ "తనకాలపుఁ బరిమితి మేల్కొను శ్రీహరి బొడ్డుదమ్మిలోపల నే మున్
జనియింపఁ బెద్దకాలంబున కాఁతఁడు సృష్టిసేయఁ బూని స్మరించెన్. ౧౯౯
మ॥ చతురాస్యంబులతోడఁ బంకజమునన్ జన్మించి తర్వాత నో
సుత! తత్కుక్షిఁ బ్రవిష్టుఁడై యిటునటుం జూడంగ బ్రహ్మాండముల్
శతము ల్కానఁగనయ్యె. నబ్రపడి మెల్లన్ వెండి నేనంత వ
చ్చితిఁబో యీవల. కంతయున్ మఱచితిన్ సృష్ట్యర్థమౌ హేతువున్. ౨౦౦
ఉ॥ బ్రహ్మము నాభినాళమున గర్భముజొచ్చి పరిన్ సృజించి యా
పిమ్మట వచ్చి యీవలకు విస్మృతిఁజెంది జడుండునై మనన్
ఖమ్మునుండి విస్ఫుటముగం "దపముండు" మటంచు నొక్క శ
బ్దమ్ముగుడుం దపించితిని దద్ద నటం బదివేలయబ్దముల్. ౨౦౧
చ॥ మఱియు శ్రుతి స్వరూపమగు మంచివచస్సు తపోబలంబునన్
సురసరణిన్ వినంబడియెఁ జోద్యముగన్. భగవానుఁడైన శ్రీ
హరియును "రాజసంబయినయట్టి గుణంబును బూని చేయుమీ
సరవి నకల్మషంబయిన సర్గ" మటంచిటు లాజ్ఞయిచ్చెఁ దాన్. ౨౦౨
ఉ॥ మానససృష్టి పూర్వమున మత్కృత. మంత మరీచిముఖ్యులౌ
మానివరు ల్విసృష్టులయి మామకసృష్టికి బాసటైరి. త

త్మానుల వేదరక్షకయిచూ సృజియించితి బ్రాహ్మణుల్గ. నీ
వా నయకోవిదాగ్రిణులయందుఁ గనిష్ఠుఁడవోయి నారదా ! ౨౦౩

సీ॥ ఉపనిషత్సారంబు నొయ్యన గ్రహియించి జ్ఞానసంపూర్ణతం బూనినావు.
అన్నివ్యాపారంబు లవలీల వర్జించి విష్ణుభక్తుండవై వెలసినావు.
అజ్ఞసంగ్రహమునకై కర్మములఁ జేయుచొంటి బ్రహ్మము చూచుచుండినావు.
అంతరంగమున నహంకారమమకారములకుఁ జోటీయక నిలిచినావు.
అస్మదాత్మభవుల యందతిలోపలం జివరవాఁడవగుచుఁ జెలఁగినావు.
ఇటు ద్విజాతులైన యీరల నెల్లర మనసుచే సృజించి మఱియు నేను ౨౦౪

సీ॥ ముఖకంజముననుండి మొనసి బ్రాహ్మణజాతి నిర్మించితిని మున్ను నేర్పుతోడ.
బాహుయుగ్మంబున బలవంతులైనట్టి రాజన్యు లుదయించి రోజ నంత.
ఊరుద్వయంబునం దుత్పన్నమయ్యెఁబో యల వైశ్యజాతి ధనాఢ్యమగుచు.
పదములనుండి యేర్పడియెఁ దద్వర్ణత్రయేతరమగు శూద్రజాతియెల్ల
అయ్యెఁ బ్రకృతులు మచ్ఛరీరాంశములను. బ్రాహ్మణులు క్షత్రియులును విద్వరులుమువురె
అల ద్విజాతులు. వారల కర్హమైన ధర్మముల వచియించెదఁ దనయ వినుము.

సీ॥ చదివి వేదంబులు చదివించుటయును మఱి చేయించి జన్నము ల్సేయుటయును
ఇచ్చి దానం బొరుం డీఁ బట్టుటయును హరిం గొలుచు నుగ్రతపంబు సలుపుటయును
నిర్జితక్రోధుఁడై నిర్మలత్వంబునఁ బను లలోభంబునఁ బొనరుచుటయు
అనృతంబులాడక యార్యుఁడై బ్రహ్మంబు ధ్యానించు చోరిమిం బూనుటయును
ఈగుణముల సతము నెవ్వఁడు భూషితుండగునో వాఁడు విప్రుఁడనఁగఁబడెడి.
అతనికిం బ్రతిగ్రహము వృత్తియైనను దఱచుగా గ్రహింపఁ దపము చెడును ౨౦౫

సీ॥ ఆమ్నాయపాఠంబు నాచరించుటయును సప్తతంతువులను సల్పుటయును
దానంబులను విప్రుఁ దనుపుటయును మఱి యుగ్రంబుగం దపం బుండుటయును
బ్రాహ్మణవరులపై భక్తిఁ జూపుటయును విచ్చుకత్తులనె జీవించుటయును
స్త్రీబాలగోద్విజక్షితి పీడితులకెల్ల రక్షకుండయి బిట్టు రాజిలుటయు
క్షత్రియులకు ధర్మసరణి. యార్తత్రాణపరులుగాఁగ నుండ నరసి వార
లకు విధించినాఁడ. నిఁక వైశ్యధర్మంబు విను వచింతునీకు వివరముగను. ౨౦౬

సీ॥ అర్థార్జనంబునం దాఱితేరుటయును బశువులం బోషించి ప్రబలుటయును
కృషియొనరింపించి కృతకృత్యుఁడగుటయు విక్రయవ్యాపారవిదుఁడగుటయు
సురభూసురార్చనపరత వర్తిలుటయు సవనంబులం బెక్కు సల్పుటయును
దాతృతావిఖ్యాతి తా గడించుటయును సరిగఁ జతుశ్శ్రుతు ల్చదువుటయును
వైశ్యధర్మంబులివి. కాఁపువార లింకఁ దగ నమంత్రకముగఁ జేయ నగును నహార
హమును షడ్దైవతశ్రాద్ధ మగ్నివిప్రక్రియు భగర్చనములు నమస్కారమునను.

తే॥ శూద్రుఁడును బ్రొద్దుపొడుపున శుద్ధుఁడగుచు హరిపదంబుల కెఱఁగి భక్త్యతిశయమున
పేరఁ దద్గుణవర్ణనశ్లోకములను జదువ హరిరూప మొలయును నారద! యతనికి.

తే॥ వార్షికవ్రతకృత్తనవరతము తిథివారదైవతుఁ డఖిలజీవముల కన్న
దాతయును గృహస్థుఁడగువాఁడు జాతిచేత శూద్రుఁడని చెప్పఁబడియెడిసుత! క్షితిపయి.

క॥ చాతుర్మాస్యవ్రతకృత్తె తనరెడు శూద్రజనుఁడు హరితనెనయు. సం
ప్రీతి నమంత్రకముగనె నాతఁడు కర్మములఁజేయ నఘము లడంగున్" ౨౧౧

సీ॥ శిల్పి ప్రజాపతి చిత్రకుండును నర్తకుండు వర్ధకి సూత్రకుండు రజకుఁ
డో నామికుండును సూనిక కొల్హికుల్ కాష్ఠాకరుఁడు చర్మకారకుఁడును
గచ్ఛకుండును దంతుకార చక్రికులును ధ్వంసిక మత్స్యఘాతకులు మఱియు
చండాలుఁడును నాఁగ సరిగ నష్టాదశప్రకృతులు వీరలు. స్వర్ణకార
కాంస్యకార శిల్పి కాండుక దారుక కుంభకారు లారుగురును నుత్త
ములు. తురంగవాహి లలి ఖరవాహియును నుష్ట్రవాహకుఁడును నిష్టకలను ౨౧౨

సీ॥ కుదురుచువాఁడును గోపాలుఁడును నధమాధమపంచకం బనఁగఁబడెడు.
రజకుండు చర్మకారకుఁడును భిల్లుండు కైవర్త నటమేదక బురుడులును
నేడ్గురు నంత్యజు. లెవనికి నెవఁడు వర్ణమున హీనుఁడో వాఁడు క్రమముగాను
అష్టాదశముఁడగు నఖిలప్రకృతుల నుత్తమమధ్యమాధమతం ద్రిభేద
మందు మణికార తాంబూలి తండులులును స్వర్ణకారక పుష్పలావకులు కంబు
కుఁడును నాపితుఁడనఁగ నేడ్గురును సిల్పు. లుత్తములు వారిలోపల నోతనూజ!

సీ॥ స్నానంబునకు నొక సమయమంచని లేదు. హోమంబు విధియింప దొక్కస్మృతియు
తపమొనరింపంగఁ దగు నర్హతయు లేదు. నియమంబుపట్టుట నింద్యమగును.
స్వాధ్యాయపరనంబు సల్పఁగా రాదు. వషట్కారములు పల్కఁజనదు నోట.
మడిమైలయనిరెడి మాటలోఁబనిలేదు. పెండ్లిపేరంటము ప్రీతికొఱకె
ప్రకృతులకుఁ బుత్ర! గురుపూజ యొకటి యుక్త. మన్ని వర్ణంబులకు నన్నియాశ్రమముల
కన్నిప్రకృతులకును విష్ణునందు భక్తి కలిగియుండుట కడు శుభకర్మ మరయ.

ఆ॥ ప్రకృతు లెవ్విధమున భాసిలుచున్నవో శూద్రుఁ డెవ్విధమున శుద్ధుఁడగునొ
అట్టిపుణ్యగాథ యంతయుఁ జెప్పితి. వినుము సావధానమనముతోడ. ౨౧౩

క॥ పరమపవిత్రంబగు నీపురాణమును శుద్ధమైనబుద్ధిఁ జదివినన్
గురుముఖమున వినినను బాగ్దురితంబు లడంగుఁ. బొందుదురు హరిపదమున్.

—♦ పైజవనోపాఖ్యానము. ♦—

తే॥ శూద్రుఁడగు పైజవననామ సుజనవరుఁడు ధర్మమార్గమునకు విరోధంబు లేక
యుండ గార్హస్థ్యమున శుద్ధినొందియుండె. నాలకింపుము వచియింతు నది మునీంద్ర!

సీ॥ తనధర్మమునఁ దాను దత్పరుండయియుండి యార్జించె నగ్గలంబైనయశము
న్యాయమార్గమున భూరర్థంబు గడియించి యర్చించె విప్రుల నబ్జనాభు.
క్షమవోలె నెంతయు శాంతిని వహియించి హితుఁడయ్యె జనముల కెల్లరకును.
కరము వివేకంబు గలిగినవాఁడయి వాదించె నేపట్ల వాస్తవంబు
ఓతనూజ! తొల్లి త్రేతాయుగంబునం బైజవనుఁడనంగఁ బడెడిశూద్రుఁ.
డతఁడు కాశినుండి సతినొర్తుఁ గొనితెచ్చి వైజయంతిపురి వివాహమయ్యె.
సీ॥ సమరూపధనశీలజననంబునందున జనియించినది యా బిసరుహనయన.
చక్కందనంబున శచికిని రతికిని దులఁదూఁగునది యా మృదుప్రతీక.
అనసూయమొదలైన యన్నుమిన్నలవంటి పతిరత యా శతపత్రవదన.
దేవతలను మహీదేవతలను సదా యర్చించునది యా మదాళిచికుర.
వైష్ణవవ్రతాది వరధర్మములఁ జేయ శక్తిగలది యా భుజంగవేణి
అట్టి శోభనాంగి యామ్నాయవిధిఁ బైజవనునిచేత లలి వివాహితయయి
చ॥ పెనిమిటితోడఁగూడి కడుఁబ్రీతి రమించె వినీతయై యతం
డును నుచితంపుఁ గాలముల నూతనయౌవనయైన యాపెతో
ననుఁగుఁదనూజ! మత్తకరి హస్తినితోడను బోలెఁ దా రమిం
చెను నతి పూర్వపుణ్యమున శ్రీసముపేతుఁడుగూడనై మనెన్. ౭౨౧
ఆ॥ స్వపరదేశములను జక్కగం జేయించె స్వీయజనులచేత బేరమంత.
అట్టు లర్థవృద్ధి యగుటయుఁ గోటికిం బడిగెయెత్తె నతఁడు. కొడుక! వింటె.
చ॥ తనయులు మువ్వు రాతనికిఁ. దండ్రికి భక్తులు. స్వీయధర్మమున్
బొనరుచుకొంచు విత్తసుదము న్వహియింపక యుండువారలున్.
జనకుఁడు వారికిం దగిన చానలఁదెచ్చి వివాహ మాచరిం
చినఁ దమ యుత్తమాంగలకు సేవలొనర్చిరి వార లెంతయున్. ౭౨౨
చ॥ ధనమును ధాన్యమున్ సుతులు తత్సుతులుం గడుఁగల్గి యిట్టులా
తనియులు బుద్ధిమంతమయి తద్దయు నొప్పుడు దేవతాతిథుల్
దిః దిన మర్చ్యమానులయి తృప్తిని జెందిరి. తద్గృహంబునన్
జని విముఖంబుగాదు ప్రిజ నారద! యేమివచింతు నీకిఁకన్ ౭౨౩
సీ॥ శీతకాలంబునం జేతి కబ్బినయంత ధనమిచ్చి బీదలఁ దనిపినాఁడు.
ఉష్ణదినంబులం దుదకంబు పోయించి యధ్వనీనులదాహ మార్పినాఁడు.
వర్షర్తువున మంచివస్త్రంబులిచ్చి దరిద్రులఁ గర మాదరించినాఁడు
అపుడిప్పుడన కెప్పు డన్నంబు వెట్టించి క్షుధితులయెడ దయం జూపినాఁడు.
గుళ్ళు కట్టించి త్రవ్వించి కూపములఁ జెఱువుల వేయించినాఁడు పైజవనుఁ డర్థ
వంతుఁడయ్యును సర్వదా వ్యసనములను బడక శివకేశవులపయి భక్తిగలిగి.
సీ॥ అకలంకమైన బ్రహ్మజ్ఞానసంపత్తిఁ "బరశివోహ" మటంచుఁ బలుకువాఁడు
తిట్టికొట్టినయట్టి చెట్టలతోఁగూడ సఖ్యంబుమైనుండు శాంతమూర్తి

నిరతంబునుం దపోనిష్ఠాగరిష్ఠుండై యూర్ధ్వరేతస్కుఁడ నై ప్పదిట్టి
అఖిలేంద్రియంబుల నగ్గంబు గావించుకొని యున్న యటువంటి కోవిదుండు
గాలవుఁడు సశిష్యగణుఁడయి యా పైజవనుని నిలయమునకు వచ్చుటయును
ఎదుఱుచని యెఱంగి మృదుమధురోక్తులం బలుకు చాసనంబుఁ బఱచి యంత

ఆ॥ "ఇపుడు సఫలమయ్యె నెంతయు నాజన్మ. మొదవె జీవితమున కుత్తమత్వ.
మిపుడు సఫలమయ్యె నెంతయు నాధర్మ ముద్ధరించితీ వహో మహాత్మ! ౨౨౬

తే॥ నాదు పాపసహస్రముల్ నీదుదృష్టి పాటి కాలిచి వైచెఁ దాపసవరేణ్య!
బహుకుటుంబికుఁడైన నాభవనమెల్లఁ జేరి నీచేఁ బవిత్రంబు సేయఁబడియె." ౨౨౭

క॥ అనిభక్తిం గనఁబఱచుచుఁ బొనరిచి యుపచారములను ముకుళితకరుఁడై
మను నా సచ్ఛూద్రునితో మునిశార్దూలంబు స్నేహమున నిట్లనియెన్. ౨౨౮

సీ॥ "కుశలమే సౌమ్య! నీకు? మది ధర్మంబున వర్తించుచున్నదే వదలకుండ?
అర్థానుబంధులై యలరుచునున్నారె దారపుత్రాదులందఱును సతము?
దాక్షిణ్యమందును దానంబునందును భక్తిగల్గివసింతె ప్రత్యహంబు?
హరిపాదతీర్థంబు శిరమునందునఁ జల్లుకొనుచుంటివా లేద దినదినమును?
విష్ణుపాదజలము వియదాపగాజలం బగును జూవె ద్వాదశాబ్దఫలద.
మద్ది ద్విగుణఫలద మగును జాతుర్మాస్య మస్తకమునఁ దాల్చు మనుజతతికి.

సీ॥ అవ్యాజభక్తిమై నాదినారాయణమూర్తికిం బొనరించు పూజనమును
బదుగురువినునట్లు బహిరంగముగఁ జేయు కేశవ సత్కథాకీర్తనమును
నానావతారము లూని చరించు విష్వక్సేను మహిమంపు సంస్తవమును
అష్టాంగయుతముగా నాచరింపఁగఁబడు మాధవచరణ నమస్కృతియును
సచ్చరిత్ర! మోక్షమిచ్చుఁ జాతుర్మాస్య"నని వచించుటయును మునిని గూడి
ఇష్టగోష్ఠులఁబరితుష్టుఁడై కొంతసేపటికిఁ బైజవనుఁడు ప్రణతుఁడగుచు

క॥ "భవదీయకృపాదృష్టిని నవితథమయ్యెను మునీ! మదాశ్రమఫల. మ
ట్లవుఁగాక. యనామయమగు భవదుక్త్యమృతమును గ్రోల వాంఛించె శ్రుతుల్.

క॥ మిముబోటుల యాగమనము క్రమముగ సర్వార్థములను గల్పించెడి. నో
యమివర! చాతుర్మాస్యము సమీపగత. మేమికతము చనుడే నిటకున్? ౨౩౨

తే॥ తీర్థయాత్రాప్రసంగ మెద్దియయినను గలదొకో"యని వచియించుడు ముదితుఁడగుచు
ధార్మికుండును సత్యవాదరతుఁడైన పైజవననామ తచ్ఛూద్రుప్రక్కఁ దిరిగి ౨౩౩

క॥ "ఎన్నియొ నెలలే చన్నవి యన్నా! నాతీర్థయాత్రయందున. నత్యా
సన్నము చాతుర్మాస్యము. తిన్నగ మన్నిలయమునకె తిరిగెద నింకన్. ౨౩౪

క॥ తొలియేకాదశినాఁడట సలుపుదు నియమంబు నేను సచ్ఛూద్రవరా!
అల నారాయణుఁ బ్రీతుం జలుపుదు. సుకృతంబు నట్లు సంపాదింతున్" ౨౩౫

సాలగ్రామ మాహాత్మ్యము.

క॥ అని గాలవముని యనుటయు విని పైజవనుండు వినయవినమితగళుఁడై
యను. "భూమిసురశ్రేష్ఠా! యనుగ్రహించి చెప్పుమయ్య యడిగినదానిన్ ౨౩౬
క॥ శ్రుతులును స్మృతులుఁ బురాణము లితిహాసము లేనియుఁ బఠియించుటకై యో
గ్యత లేదు నా. కనస్వాఁడ శ్రుతిసారజపంబునకును క్షోణిసుపర్వా! ౨౩౭
ఆ॥ కాన నాకుఁదగినకర్జంబె యొకటి మహాఫలంబుగలది యానతిమ్ము.
అదియె హరిపరుండినపు డాచరించిన ముక్తినొసఁగవలయు మునివరేణ్య!" ౨౩౮
క॥ అనవుడు గాలవముని యిట్లనుఁ. "చక్రాంకితపుటుఁడగు హరి సాలగ్రా
మనివహ్ణు నెవరు నిత్యంబును గొల్తురో ముక్తి వారిముందఱ నుండున్. ౨౩౯
శా॥ సాలగ్రామమువిూఁదనిల్పి మనమున్ సత్కర్మ మొక్కింతయే
నాలోచించునుగాక యక్షయఫలంబౌ నద్ది యెల్లప్పుడున్.
శ్రీలోలుండు పరుండియున్నయపు డారీతిం గృతంబైనచో
మేలౌ నంతకునెక్కు. డట్లగుటఁ జేర్మిన్ దానిఁ బూజింపుమా. ౨౪౦
క॥ సాలగ్రామశిలయు మఱి మేలగు ద్వారావతిశిల మిక్కిలి భక్తిన్
మేళన మొనరిచి యొకచోఁ బూలం బూజించుజనుఁడు పొందును ముగితిన్. ౨౪౧
కం॥ సాలగ్రామశిలం బదివేలకొల ల్సేసినట్టి వెంగలియేనిన్
హరి నెటునుంచి కొలుచునో చాలఁ బవిత్రమగుఁ జట్టుస్థల మేక్రోసుల్. ౨౪౨
ఆ॥ బ్రహ్మరూపమది. శుభమును. దేజఃపిండ. మడఁగు దానిఁజూడ నఘము లపుడ.
తీర్థములును నదులు దేవళాత్తత్పార్శ్వమునఁ జెలంగఁ దీర్థతను భజించు. ౨౪౩
ఆ॥ తత్సవిూపమునఁ గృతములైన సత్క్రియల్ సత్క్రియాత్వ మొందఁజాలు ననఘ
అంతకును విశేష మదియె చాతుర్మాస్య సంఘటించునెడల. సత్యమిద్ది. ౨౪౪
క॥ సాలగ్రామశిల యెవనియాలయమం దుంచఁబడినదయి తులసీప
త్రిళిం బూజింపఁగఁబడుఁ గాలుం డవ్వానిగృహముకడ కరుగఁ డిఁకన్. ౨౪౫
ఆ॥ విప్రబాహుజులకు విశులకుసచ్ఛూద్రులకును బైజవన! కల దధికార.
మెట్టిసమయమందు నేని సాలగ్రామపూజనమున లేదు సో యొరులకు" ౨౪౬
క॥ అని యిటు వాక్రుచ్చుటయును విని పైజవనుండు "వేదవిద! స్త్రీశూద్రుల్
ఘనసాలగ్రామశిలార్చన మొనరుపఁదగరటంచు శ్రీవణింతుఁగదే. ౨౪౭
క॥ ననుబోటి శూద్రజనముల కనఘా! యది యెవ్విధమున నయ్యెడిఁ బూజ్యం?"
బని ప్రశ్నసేయుటయు నోతనయా! గాలవమహర్షి తగ నిట్లనియెన్. ౨౪౮

తే॥ "అనిషిద్ధ మసచ్ఛూద్రులందె కాని కాదు సచ్ఛూద్రవిషయము. కలుగు సాధ్వు
లైన స్త్రీలకుఁ దత్పూజనాధికార. మిందు సందియ మొందకు. డిందు ఫలము. ౨౪౯

క॥ సాలగ్రామార్చనపరు లోలిం దనుపారిశుద్ధ్య మొంది వివేక
శ్రీలలితులగుచుఁ జిగురుకఁ గాలునిపుటభేదనంబు గాంచరు దాసా! ౨౫౦

క॥ సాలగ్రామార్పితమగు పూలను శిరములధరించు పుణ్యాత్ముల ప్రా
క్కాలాచరితంబులయిన వేలకొలల్ తత్క్షణమున విలయముగాంచున్. ౨౫౧

క॥ సాలగ్రామాహ్వయశిల మ్రోలను దీపంబు వెట్టి మ్రొక్కెడి మనుజుం
డా లేఖపురి వసించెడు. నేలోపము దానికుండ దెయ్యెడనైనన్. ౨౫౨

క॥ సాలగ్రామగ హరికిం జాలం బంచామృతమున స్నపనము సేయన్
మేలౌ చాతుర్మాస్యను బూలం బూజింపఁ బడరుపో సంస్కృతిలోన్. ౨౫౩

ఆ॥ అమృతహేతు వమలుఁ డగుచు సాలగ్రామమున వసించు హరిని మనములోన
నుంచి భక్తి ధ్యాన మొనరించువానికి ముక్తి మూటనున్న భూరిచుమ్ము ౨౫౪

క॥ తులసీదళమాలికచే లలి సాలగ్రామశిల కలంకృతి సేయన్
ఫలియించుఁ గోర్కెలన్నియు. నల చాతుర్మాస్యమునను నతిశయ మింకన్ ౨౫౫

ఆ॥ కాదు పుష్పమాల కరము సాలగ్రామమునకుఁ బ్రియము శూద్రజనవరేణ్య!
హరికి సార్వకాల మల తులసీదేవి వల్లభయును. శుభనివాసినియును. ౨౫౬

క॥ సాలగ్రామము విష్ణుం. డాలక్ష్మీదేవి తులసి. యందున నెపుడున్
సాలగ్రామంబునకది చాలఁబ్రియం. బంతకెచ్చు చాతుర్మాస్యన్. ౨౫౭

ఆ॥ గంధమిశ్రితోదకమున సాలగ్రామశిలను గడిగి లేఁత తులసిగుత్తు
లం దదర్చనంబు లలి నాచరింప నవాప్తకాముఁడగును నవని నరుఁడు. ౨౫౮

ఆ॥ ప్రథమపత్రమందు బ్రహ్మ ద్వితీయపత్రమున శివుఁడు గుత్తిఁగమలనాభుఁ
డలరుచుంట సదళమగు గుత్తి గ్రాహ్యంబు దేవతాత్రయంబు సేవితంబు. ౨౫౯

క॥ జనవాది క్షయకృత్తఘ్నమంజరి ధూపరాశిఁ దత్సాలగ్రా
మను బూజసేయునది సతమును జాతుర్మాస్య మతియు ముఖ్యం బందున్ ౨౬౦

క॥ తులసిం బూలం బూజిత మల సాలగ్రామ మెవ్వఁ డవలోకించున్
కలుషసహస్రంబులకుం దొలఁగి విశుద్ధాత్మతం జతుర్భుజుఁ గలయున్. ౨౬౧

తే॥ గండకీజలసంభవగ్రావగు హరిఁ దమి శ్రుతిస్మృతులను బురాణములచేత
నెవఁడు స్తుతియించు వాఁడు సుపేంద్రపదముఁ జేరు సచ్ఛూద్ర! యేమని చెప్పవాఁడ.

క॥ సాలగ్రామాహ్వయశిల గ్రాలుఁ జతుర్వింశతి ప్రకారంబుల. న
వ్వీలోకంబునఁ బూజ్యము. లాలింపుము వాని పేళ్ళ నభివర్ణింతున్. ౨౬౩

—— చతుర్వింశతి సాలగ్రామములు. ——

సీ॥ కేశవసంజ్ఞచేఁ గీర్తింపఁబడు నాద్య మగు మధుసూదనాఖ్యము ద్వితీయ.
మవలిది సంకర్షణాభిధానంబగు. నగును దామోదరాఖ్యము చతుర్థ.
మగు వాసుదేవాఖ్య మాతరువాతిది షష్ఠంబు ప్రద్యుమ్నసంజ్ఞగలది.
విష్ణునామంబున విలసిలు సప్తమం బష్టమంబగు మాధవాభిధాన
మవు ననంతమూర్తి నవమంబు పురుషోత్తమాహ్వయంబు దశమ. మాదటుది య
ధోక్షజాభిధాన మవలిది యగు జనార్దనసమాఖ్య మిష్టదంబు. మఱియు　　౨౬౪
సీ॥ గోవిందనామ మగుఁ ద్వాదశము. త్రివిక్రమనామకము చతుర్దశముది యగు.
అల శ్రీధరాహ్వయ మగుఁ బంచదశముది. యగు హృషీకేశాఖ్య మవలిమూర్తి.
సప్తదశాష్టాదశములు శ్రీనృసింహ విశ్వయోన్యభిధాన మతులితములు
పందొమ్మిదవది యా వామనాఖ్యాకంబు నారాయణాభిధానం బవలిది
పుండరీకాక్షనామకమూర్తి యిరువదొకటవది. పైదుపేంద్రాఖ్య నొప్పునదియుఁ
హరి యిరువదిమూఁడవది. కృష్ణాభిధాన మంతిమముది. మహాశూద్ర! యాలకింపు
క॥ సాలగ్రామ విభేదము లోలిని వచియించినాఁడ నోశూద్ర! యెవం
డాలించుదీనిఁ జదువును శ్రీలోలుఁడు వానియెడలఁ జేయును గరుణన్"　　౨౬౬

—— దేవతలు శివదర్శనార్థము మందరగిరి కరుగుట. ——

క॥ అనియిటు వాక్రుచ్చుటయును జనువునఁ బైజవనుఁ "డార్య! సాలగ్రామం
బును శిలయే కాన సనాతనుఁడగు హరి గండకి నెటు తా శిలయయ్యెన్?　　౨౬౭
తే॥ భవదనుగ్రహమున విష్ణుభక్తి నాకు దృఢతమంబయ్యెడిని బ్రహ్మబుషివరేణ్య!
తీర్థరూపులు మీరలు దృష్టిపథ్యఁ బడినమాత్రన పాపము ల్పరిహరింతు.　　౨౬౮
తే॥ తీర్థజలములఁ గ్రుంకి యేతీరుగాను బ్రజలు పావనులగుదు రప్పగిది నేను
త్వద్వచోమృతపానముం దవిలి చేసి యగుదుఁ బావనుఁడను సంశయంబులేక"
క॥ అని వక్కాణించుటయును ముని యిట్లను. "హరి శిలాత్వమును లింగత్వం
బును హరుఁడుఁ బొందినట్లుగ వినఁబడు నితిహాస మొకటి విను. వినిపింతున్.
తే॥ తొల్లి దక్షప్రజాపతి దుహిత సతిని శివుఁడు వేదోక్తవిధిఁ బెండ్లిసేసికొనియె.
అంతఁ గాలాంతరంబున నాకతండ్రి యాగ మొక్కటి తలపెట్టి యందు నల్లు　　౨౭౧
చ॥ పిలువ కుపక్రమించుటయు బిడ్డ తదధ్వరశాలకేగి బి
ట్టలిగి కృశానుధారణను బ్రాణములన్ నియమించి విగ్రహం

బిలపయి విడ్చె. విడ్చుచును హృత్సరసీరుహమందుఁ బ్రీతితో
వలిమల సంస్మరించెఁ బితృభాగము వీడి స్వభాగయుక్తయై. ౭౭౨
మ॥ తమచేఁ బూర్వ మొనర్పఁగాఁబడిన సత్కర్మంబొ దుష్కర్మమో
స్వమనంబుల్ మరణించుకాలమున నేస్థానంబునం జేర్చు న
ట్రిమతం బోయి జనింతు రెల్లరును దత్స్థానంబునం గాన నా
దమనోదగ్ధశరీర యద్రిపతికిం బాఁ గూఁతురై పుట్టెఁ జా ౭౭౩
క॥ అటు పార్వతియై యాయమ నిటలాక్షుని మనమునందు నిల్పి తపం బు
త్కటముగఁ జేయంగడఁగెను నుటజం బేర్పఱచుకొని త దుర్వీధ్రముపైన్.
చ॥ పదపడి వేయియేడులకు బ్రహ్మణుఁడై చనుదెంచి శంభుఁ డా
సుదతిని గర్మభావముల శోధనచేసి తపోవిశుద్ధగా
నెద గుఱుతించి దివ్యమగు నింకొకరూపునఁ జేయివట్టి "యో
ముదిత! భవత్తపంబునకు మోదముఁజెందితి. నేమికావలెన్?" ౭౭౫
చ॥ అని "గురుఁడైన నాదుపిత యాను బ్రమాణము నా" కటంచు న
య్యనఘ వచించుడున్ గిరిశుఁ డత్రిమహామునిఁ దొట్టి యేడ్గురన్
మునులను బంపె నచ్చటికి. మున్ సమయంబు వచించి వారల లా
ఘునుని యనుజ్ఞఁదీసికొని గ్రక్కునఁబోయిరి శూలిపాలికిన్. ౭౭౬
ఆ॥ అంత లగ్నదినమునం దింద్ర హరి పద్మయోనిముఖర సురలు యోగసిద్ధు
లగ్నిదేవు నంద ఱగ్రిమం దిడుకొని వచ్చి శంకరుని వివాహమునకు ౭౭౭
ఆ॥ తరలిపోవుటయును దదభిముఖంబుగాఁ జని నగాధిరాజు సంతసమున
మంగళంబులైన మధుపర్కముఖోపచారములను వరుని గౌరవించె ౭౭౮
క॥ కృతకృత్యంమన్యుండై శ్రుతిచోదితవిధిని దనదు సుత నర్పింపన్
క్షితిసురవృతుఁడై యతఁ డాసతి పాణిగ్రహణ మెలమి సల్పినవాఁడై ౭౭౯
క॥ చేసెఁ బ్రదక్షిణ మగ్నికి. దాసా! విను గానవేళఁ "ద్వద్గోత్రమె"దం
చా సర్వేశ్వరు నడుగుడుఁ దాసిగ్గున వానముద్ర దాలిచెఁ జామ్మ. ౭౮౦
ఆ॥ బ్రహ్మవచనమునను బరమేశ్వరుఁడు విధిశేషమును ముగించి శీఘ్రముగను
చరువుఁబుచ్చుకొనెడి సమయంబునం బంచవదనుఁడయ్యె. నేమిముద మొయదియౌ.
ఉ॥ తొమ్మిదికోట్లమోములను దోడనె పార్వతి తా ధరింపఁగా
"నమ్మక చెల్ల!" యంచు జన మచ్చెరువందె నభమ్మునుండి స్థై
ర్యమ్ము వహింపు మీవు శివ! యంబిక లజ్జితయయ్యెఁ బంచజ
న్మమ్ముల నిన్నుఁ బీడదిఁక. నాథుఁడ వీవె తదంబుజాక్షికిన్ ౭౮౧

చ॥ అమరులయుఙ్ గిరీంద్రులయు నన్వయము ల్కాడు సంతసించె”నం
చమలములుం ద్రయీమయము లైన నుహ ల్వినయ్యె. నవ్వివా
హ మిటులఁ బూతిఙఁజెందుటయు హర్షముఁబొంది యుమామహేశ్వరుల్
హిమగిరి పారిబర్హమిడి యెంతయు వేడుకఁ బంపె నల్లునిఙ. ౭౮౩
సీ॥ ఘనసహస్రస్తంభ కమనీయతసమును మణిమయవేదికా మండితమును
సుప్రశస్తపరిఖా శోభాయమానముఙ సకలవస్తుసమృద్ధి సంయుతమును
మాణిక్యవిద్రుమ మాలికా కలితముం బారిజాతోద్యాన భాసురమును
నవకామధేను చింతామణిసహితముఙ మందరభూమీధ్ర మధ్యగతము
నైన గేహ మొకటి యావిశ్వకర్మచే నిర్మితంబగుడుఁ గిరిసేతు్రిలు ధృత
శూలు లాత్మరూపులై లలితపియించు గణము లంగణమునఁ గాఁపువెట్టి
ఆ॥ హరుఁడు కామవృద్ధికరమగు తద్దివ్యభవనమధ్యమందుఁ బార్వతీస
మేతముగ వసింప మెలమెల్ల మదనుండు వాయురూపమునను వచ్చియటకు ౭౮౪
కం॥ “దండమునీకు వృషధ్వజ ! దండం బఖిలస్వరూప ! త్వత్పదములకుఙ.
దండమునీకు గణాధిప దండం బర్పింతునాథ! దయఁబ్రోవుము నఙ. ౭౮౫
ఆ॥ నీవు లేనిజగము నిజముగా భూదేవి శవమువలెను దాఁజ సంస్పృశించు.
నిన వినా యొకింతయును సచరాచరమైన జగతి నున్న యదె మహేశ !
తే॥ ఈవు త్రిజగంబులను సృజియింతు మఱియు నీవు రక్షింతు.హరియింతువీవ దేవ!
కరుణయుంచి యొనర్పుము కాయదాన”మని నుతించుచుయును నీళుఁడతనిఁగాంచి
ఉ॥ “ఏగిరిమీఁద నావలన నెంతయు దగ్ధుఁడనైతొ యీవుము
న్నాగిరిపైనె వెండియును నంగముఁదాల్పు”మటంచుఁ బల్కుడుఙ
దాఁ గమనీయదేహమును దాలిచి శూలికి శైలజాతకుఙ
వేగ నమస్కరించి యరవిందశరుండు కడుఙ విధేయుఁడై ౭౮౬
ఆ॥ అలయుమామహేశ్వరుల కృపాదృష్టికిం బాత్రుఁడగుచు వారి పాలినుండి
చరిగి త్రిజగములను దిరిగె మహాతేజుఁడైన పంచబాణుఁ డనఘ! యంత.
ఆ॥ హర్షపూరితుండు నాకుంచిత శిరోరుహుండు మోహబలయుతుండు నగుచు
ఘూర్ణితేక్షణములఁ గుసుమాస్త్రిఁ డటు చరించుచుఁ దదంగములను జొచ్చెఁదుదకు.
కం॥ దివ్యములగు నాసవములు భవ్యములగు గంధమాల్య పట్టాంబరముల్
దేవ్యంతికమం దుంచిరి యవ్యయముగ సురతవేళ నంతట సకియల్. ౭౯౨
ఆ॥ ఇట్లు తమకమునను నెంతయుం గ్రీడించు రాజవశాళి కొక్క రాత్రివోలె
వర్షశతము వెళ్ళవచ్చుటయును సురల్ తారకామరారి దాడి కోడి ౭౯౩

సుగంధి॥ తమ్ము మాలి శరణుఁజొచ్చి "తాత! త్వద్వరప్రభా
వమ్మునన్ మదించి బిట్టు వైరమూని తారకుం
డిమ్మెయిం బరాక్రమించి యింద్రుగెల్చి మూఁడులో
కమ్ము లేలుచున్నవాఁడు కంటె రౌద్రమూర్తియై ౨౯౪

కం॥ త్రైలోక్యపూజితుండయి క్రాలెడు నవ్వాని వధకుఁగా సదుపాయం
బాలోచింపవె" యనుచుం జాలనుతించుటయు నాభిజాతుఁడు ప్రియన్ ౨౯౫

తే॥ "నేను వరమిచ్చువానికి నేనె మరల సంహరించుట కెమ్మెయి సాహసింప.
తానుబెట్టినచెట్టును దానె మరలఁ గొట్టివేయుట తగ దెట్టివారికేని. ౨౯౬

ఆ॥ కాన వానివధకుఁ గల దొక్క సదుపాయమాలకింపుఁడీగ, లమ్మహాత్ముఁ
డగు మహేశువలన హైమవతీగర్భమందుఁ బుట్టినట్టి యర్భకుండు ౨౯౭

తే॥ ఏడుదినములవాఁడయియే వధించుఁ దారకాసురు" ననవుడు దైవతాళి
దానవులచేత నెంతయుం దాడ్యమానమగుచు నటనుండి మందరనగముఁ జేరి

మ॥ అట నీశానుగృహంబుముందటఁ ద్రిశూలాద్యాయుధోపేతులై
భటవర్గంబగు నందిముఖ్యగణము ల్పాలించుచుం గాల ను
త్కటదుఃఖావిలమానసాంబుజులు సంత్యక్తాత్మసంస్థాయులై
విటపిచ్ఛాయ సమాశ్రయించి యచటన్ వేచ్చెఱ నాల్మాసముల్ ౨౯౯

—• పార్వతి యింద్రాదుల శపించుట •—

సీ॥ సకలభూతముల హృత్స్థలిఁ బార్వతిం గూడి యైదుమోములతోడ నలరువాని
అలఘు జటాజూట మావరింపఁగఁ దల బలుకిరీటము పెట్టి చెలఁగువాని
అజగవ శూల ఖట్వాంగాదికంబులం బదిచేతులం దాల్చి పరఁగువాని
కర్పూరముంబోలెఁ గడుగౌరమగు మేన వెలిబూదిపూఁతఁ ద్రిభాసిలెడివాని
పాపజందెంబులం దోడ్తి పైని జింకతోలు గజచర్మముం గప్పి క్రాలువాని
ప్రతిమ నావాహనముచేసి భక్తిమై షడక్షరజపంబు సేయుచు సధికనిష్ఠ

కం॥ వ్రతచర్యఁబూని యీవిధి సుతపము గావించి" రనుడు శూద్రుఁడు మునితో
"వ్రతచర్యయనుచు నేగతిఁ గృతమగుచోఁ జెప్పఁబడునొ కీర్తింపఁగదే.

తే॥ తావక వచోమృతం బెంతత్రావినను మహాత్మ! సంతృప్తిగాదయ్యె" నని యనుటయుం
గాలవుఁడు పైజవనువంకఁ గరుణఁజూచి యెంతయును సంతసంబున నిట్టులనియె.

సీ॥ "మసనంపువెలిబూది మఱి పాపజందెంబు ఖట్వాంగమును బటికంపుఁజేరు
తలకాయపుత్తిలదండ కపాలంబు నచ్చెరువొదవించు నైదునోళ్ళ
సిగమీఁదఁబుట్టిన సోగ్గైన నెలరేక దొడ్డయేనికతోలు దుప్పటంబు
ఫణికుండలద్వయి బలువుగంటలజంట పులితోలుగోచి ముమ్మొనలవాలు

జపముసేయుచు నెమ్మి వ్రతచర్యయనంగ నీ సులక్షణముల లక్ష్యమే మదుక్త.
మళ్లు శతరుద్రిజపమును నాచరించి యల మహావిష్ణువునుబోలె నధికభక్తి

ఆ॥ సోము వరదు షోడశోపచారంబుల నగ్నిముఖులైన యఖిలసురులు
హరి పరుండియున్న యానాల్గు నెలలుఁ బూజించి కరము శుద్ధిఁగాంచుటయును

తే॥ సంతసించి జీవాత్మండు సకలభూతద్రష్ట నగు రుద్రుఁడిచ్చెను దీవి కాస.
మంత యోజించి తెఱగంటు లగ్నిదేవు సన్నుతించి ప్రసన్నుని సల్పుకొనిరి. ౧౦౬

మత్తకోకిల॥ కార్యసాధనతత్పరుండయి కర్మసాక్షి మహాద్యుతిన్
భార్య భర్త పరున్నచోటికిఁ బావురంబయి పోయి యా
శ్చర్యకార్యవశుంకరుండన సర్వణాదులఁ దన్మన
శ్చైర్యముం బొనరింపఁ గన్గొని చంద్రశేఖరుఁ డంతయున్ ౧౦౭

ఆ॥ హేతు వెఱిఁగి యూర్ధ్వరేతస్సు దాని వక్త్రమున వదలుటయును దాల్చి దాని
ఒక్కగంతులోన నుదవసితంబు వెల్వలికి దూఁకె నౌర ! పావురాయి. ౧౦౮

ఉ॥ పావుర మావలం బడుడుఁ బార్వతి స్వశ్రమ మెల్ల వ్యర్థమై
పోవుట కాగ్రహించి సురపుంగవులం గని "పుత్రహీనతన్
గ్రావములై వసింపుఁడిఁకఁ గావలు" లంచు శపించె. దీనులై
యావిడ కాళ్ళమీఁదఁబడిఁ బ్రార్థనసేసిరి వార లీవిధిన్.

సీ॥ తల్లివీవు సమస్తదైవతములకును సాక్షివీవు సమస్తజగములకును
జగదుదయస్థితి సంహారకర్త్రి వపర్ణవు నిత్యరూపవు వరేణ్య
వఖిలరూపవును మంత్రారాధ్యవును సనాతనవు వసుంధరవును వరదవు
భూతధాత్రివి మహాభూతాశ్రితవును స్వాహారూపమున నధ్వరాదిఫలద
వజహరీశ్వరాదులందున మంత్రయంత్రయుతవును నిరంజనవు మహేశ్వ
రివియు మంత్రబీజమవు విశ్వబీజలయస్థితినియు నాదు వంబ ! నీవు ౧౦౯

కం॥ ఈవు మహాలక్ష్మివియును నీవు మహాకాళివియు సురేశ్వరివి మహా
దేవివియు మహారూపవు నీవు మహామాయవు జగదీశ్వరి వరయున్ ౧౧౦

ఆ॥ తపములను ధరించు దానవు దోషత్రయావృతోద్భవముల నధికశ్రేయ
మిచ్చునట్టిదాన విఁకను భూతప్రకృతిస్వరూపవును నుతింపఁదరమె. ౧౧౧

కం॥ మాయాబీజవరప్రదవై యిల బిల్వముల నెవ్వ రర్చింతురో యా
ధీయుతుల కిత్తు రాజ్యం బేయిష్టము నేని యిత్తు విఁక సిద్ధిదవున్. ౧౧౨

శా॥ చాతుర్మాస్యను బిల్వపత్రముల నిన్ శ్రద్ధన్ సమర్చించు నే
భూతశ్రేణి మనోరథంబు లెపుడుం బూరింప సొంతంబుగా
శీతక్ష్మాధరసూతి వైతి. వేదియున్ సిద్ధింపఁగం జేతు. వా
చాతుర్మాస్య మహాఫలప్రదము నీసంసేవ కాత్యాయనీ ! ౧౧౩

చ॥ ఎవ రనయంబు లోకమున నీశ్వరుతోడను గూడియున్న నిన్
బ్రవిమలబిల్వపత్రముల భక్తిభజింతురొ వారలన్ వృథా
లవమును సంస్పృశింపదు, కొల్లదరిఁజేరవు. నేఁటినుండి నీ
వపుదువు జ్ఞానదాయినివి యట్లు యజించెడివారి కంబికా! ౭౧౪

కం॥ చాతుర్మాస్య మహాఫల మేతద్బిల్వం బుమామహేశుల యలఘు
ప్రీతికి విధివర్ధనము. మాతా! యక్షయముగాదె మాకే దవనిన్. ౭౧౫

మ॥ తులసీవృక్షమునందు లక్ష్మివలె నీదు శ్రేష్ఠమం దీవు మం
జులమా మూర్తిన్ నభీష్టదాత్రి వగుచుం జూపట్టుచుం. దందునన్
దులసీవృక్షము బిల్వవృక్షమును జాతుర్మాస్య సేవించినన్
ఫల మత్యంత" మటంచిటు ల్సురలు సంప్రార్థించి రీశాని నాన్ ౭౧౬

ఉ॥ పైజవనుండు గాలవుని పక్కకుఁ జక్కఁగ మోము ద్రిప్పి "యే
యోజఁ దులస్యనోకహము నొంది వసించెడి లక్ష్మి? భూమిభృ
ద్రాజతనూజ బిల్వమున రాజిలనుండిన హేతువేమి? య
వ్యాజకృపన్ వచింపు మిదియంతయు" నా విని యాతఁడిట్లనున్. ౭౧౭

మ॥ "మును దేవాసురయుద్ధమందు బలదర్పద్దానవు ల్వేల్పులన్
మననీకుండుడు వారు భీతిఁ జని బ్రహ్మంగూర్చి నోహారొన
ర్చ నుతుల్సేయ నతండు "మీ మొగములం జెల్వంబు లోపించె. నే
మి నిమిత్తంబు మదీయగేహమునకున్ మీరందఱుం గూడిరాన్?" ౭౧౮

క॥ అన "నని నద్భుతకారులు దనుజు ల్మముఁ బుండు రీఁగ దంచుటవలనన్
నినువచ్చి శరణుఁజొచ్చితి మనఘా! రక్షింపు" నాఁగ నతఁడిట్లనియెన్. ౭౧౯

ఆ॥ "ఎవరిపక్షమందు నేనుండఁజాల మీయుభయులందు నాకవిబుధులార!.
ధర్మమాశ్రయించి తగనుండు మీమ్రోలఁ జెప్పెదను నుపాయ మిప్ప డొకటి.

క॥ హరిహరభక్తుల కొకపరి పరస్పరము వివాదమగుడుఁ బరమేశ్వరుఁ డ
చ్చెరువగురూపము దాల్చె హరిభక్తులతోడ నైక్యమందినవాఁడై. ౭౨౧

సీ॥ అర్ధదేహంబునం దంబుజనాభుండు శేషార్ధమున ఫణిభూషణుండు
ఏకత్రి కమలాలయేశుని చిహ్నంబు లన్యత్రి త్రిపురాభియాతిచిహ్న
లొక వైపువాహన మురగాంతకుఁడు మఱియొక వైపువాహన ముక్షరాజు
హామార్ధగాత్రంబు వారివాహాభంబు కర్పూరగౌరంబు కడమతనువు
అట్టి హరిహరాత్మమగు రూపు దాల్చెడు జగము తదుభయైక్యసమతఁబరఁగ
జగము తదుభయైక్య సమమయి యారీతి భేదమతుల నెల్ల బిలుతుమార్చె. ౭౨౨

౯ గోటేటి వేణుగోపాలరావుగారు, పోలీసుసర్కిలినస్పెక్టరు, నర్సారావుపేట.

౧౦ నారాయణరావుగారు, దాతారుపల్లి

౧౧ రంగరాజు గోపాలకిషన్ రావు దేశముఖుగారు-పాపురం.

౧౨ జూలూరి వెంకటరత్నంపంతులుగారు, గుంటూరు

౧౩ భాస్కరరాయుని వెంకట రామయ్యగారు, వంగపల్లి

౧౪ బుడంపాటి సుబ్బయ్యగారు, మర్చంట్, కాకినాడ

౧౫ వేలూరి రామన్న గుప్తగారు, సదాశివునిపేట

౧౬ రాచూరి సుబ్బయ్యగారు - శ్రీ శ్రీ విరూపాక్షసంస్థాన ప్రధానమంత్రి

౧౭ ఘంటంభట్లగారి వెంకటభుజంగముగారు - ముసలాపురం

౧౮ తిగుళ్ళ కృష్ణారెడ్డిగారు. పటేలు - ముసలాపురం

౧౯ కప్పగంతు సుబ్బారావుగారు - పోలీసుసబినస్పెక్టరు - కొమ్మాలపాడు.

౨౦ రంగావజ్ఝుల రంగయ్యగారు, నర్సారావుపేట

౨౧ నండ చినవెంకయ్యగారు, దండమూడి.

౨౨ శ్యామాపంతుల గోపాలరావుగారు - హైదరాబాద్.

౨౩ తిరుమలవల్యాక్ చక్రవర్తి వరదాచార్యుల అయ్యవార్లంగారు - కొత్తాపురం

౨౪ కన్నయ్యగారిసంగయ్యగారు-ముసలాపురం

౨౫ తాళవెలిమ లింగన్న మొకద్దంగారు-గడిపెద్దాపురం

౨౬ కిషన్ రావు దేశపాండ్యాగారు తాళ్లపల్లి

౨౭ వెంకటరాజయ్య, మక్తేదారుగారు - సీతారాంపురం

౨౮ సుబ్బారెడ్డి దేశముఖుగారు, క్షీరసాగరం.

౨౯ కుంటపల్లి రామారావుగారు, సంగెం.

౩౦ చివుకుల శ్రీరామశర్మగారు- నాగులుప్పలపాడు

౩౧ రాయచూరి బందేరావుగారు, అయినాపురం.

౩౨ గజవాడ వెంకటాచార్యులుగారు, అల్లాదుర్గము

౩౩ కొండంభట్లగారి వెంకన్న గారు. గుమ్మడిదల

౩౪ లింగాల సీతారామరెడ్డి బండారెడ్డి దేశముఖుగార్లు-నారాయణపురం

౩౫ చెన్నూరి నరసింహారావు దేశపాండ్యాగారు-పెదవీడు.

౩౬ కందాళం కేశవాచార్యులుగారు-కిచ్చన్నపల్లె.

౩౭ కుంటపల్లి అమృతరావుగారు-సంగెం.

౩౮ మాణిక్యంగారి బాలచంద్రయ్యగారు-హైదరాబాదు.

౩౯ టేకులపల్లి కృష్ణారెడ్డిగారు, కేశవాపురము.

అభినవసరస్వతి

సంపాదకుఁడు - నాగరఖండస్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు

జానపాటి పట్టాభిరామశాస్త్రి.

ఇది యొకమాసపత్రిక ఇందు వర్ణాశ్రమధర్మబోధక గ్రంథములును విమర్శనములును వ్యాసములును బ్రకటింపఁబడును. చందా సం॥ 1 కి రు 3—0—0

ఈ కార్యస్థానమున వెలకుదొరకు పుస్తకములు.

1	కరిణీకోద్ధారిణి [పూరె వీరభద్రకవి]	...	0	4	0
2	వాసంతికాపరిణయ నాటకము	...	0	4	0
3	కంసవధ నాటకము	...	0	8	0
4	చమత్కారమంజరి (సింహాద్రి వెంకటాచార్యులు)		0	4	0
5	విరూపాక్షపీఠగురుపరంపర	...	0	2	0
6	నీతిగీతులు (సుమతిశతకమునకు సంస్కృతము)	...	0	2	0
7	విశ్వబ్రాహ్మణశబ్దఖండనము, బ్రాహ్మణశబ్దవిచారము		0	2	0
8	విగ్రహారాధన ఖండనఖండనము	...	0	4	0
9	చిత్తూరుజిల్లాతీర్పు విమర్శనము (పత్రికాధిపతి)	...	0	4	0
10	సంగదోషము	...	0	3	0
11	అస్పృశ్యతానివారణ ఖండనము(మల్లాది రామకృష్ణచయనులుగారు)		0	8	0
12	వత్సలనీతిశతకము	...	0	1	0
13	నర్సారావుపేట శతావధానము (తిరుపతి వెంకటీయము)		0	3	0
14	పశ్యశబ్దవిచారము	...	0	2	0
15	పురశ్చరణము	...	0	2	0
16	శంతనురాజచరిత్ర	...	0	14	0
17	వర్ణవ్యవస్థ	...	0	4	0
18	స్వర్ణకారవ్యవహారము	...	1	8	0
19	శుద్ధాంధ్రహరిశ్చంద్ర చరిత్రము	...	0	10	0
20	అభినవశాకుంతల నాటకము	...	0	8	0
21	సూతసంహిత-ఆంధ్రము	...	2	0	0
22	స్కాందమహాపురాణాంతర్గత నాగరఖండము (౧ సంపుటము)		1	0	0
23	డిటో నాగరఖండము (౨ సంపుటము)		1	8	0
24	డిటో నాగరఖండము (3 సంపుటము)		1	8	0
25	భారతీయప్రబోధము (పిడుపాటి చిదంబరశాస్త్రి)		0	4	0
26	ధర్మనిర్ణయము.		0	4	0
27	భారతకథాతత్త్వనిర్ణయము(మల్లాదిరామకృష్ణవిద్వచ్ఛయనులుగారు)		0	4	0

అభినవసరస్వతీకార్యస్థానము, జానపాడు, పిడుగురాళ్లపోస్టు,
గుంటూరు జిల్లా.